
## వారసత్వ సంపద సంరక్షణ..
# అందరి బాధ్యత

**కేంద్ర గనుల మంత్రిత్వశాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతారావు**

జమ్మలమడుగు – మేజర్‌న్యూస్


ప్రపంచ స్థాయి గుర్తింపు పొందుతున్న గండికోట పర్యాటక కేంద్రం మన భౌగోళిక వారసత్వ సంపద అని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని కేంద్ర గనుల మంత్రిత్వశాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతారావు పేర్కొన్నారు. గురువారం గండికోట పర్యాటక క్షేత్రంలోని అడ్వెంచర్ స్పోర్ట్స్ మిగతా 2పేజీలో



18 వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
వైఎస్ఆర్ కడప
శుక్రవారం 11 ఏప్రిల్ 2025 : పేజీలు 8



# రాములోరి కళ్యాణం.. చూద్దాం రారండి!



- నేడే ఒంటిమిట్ట కోదండ రామస్వామి కళ్యాణోత్సవం
- 12 టన్నుల సాంప్రదాయ పుష్పాలతో కళ్యాణవేదిక ప్రత్యేక అలంకరణ
- సాయంత్రం 6.30 నుంచి 8.30 వరకు మహోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన టీటీడీ అధికారులు
- ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న సీఎం బాబు దంపతులు
- భక్తులకు తొలిసారిగా తలంబ్రాల పంపిణీ
- 28 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు
- ఉదయం నుంచి రాత్రి వరకు ఉచిత అన్నప్రసాదం
- 3వేల మంది పోలీసులతో భారీ భద్రత..
- 137 సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా

కడప బ్యూరో – మేజర్ న్యూస్

ఒంటిమిట్ట శ్రీ కోదండ సీతారామస్వామి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం సాయంత్రం 6:30 నుండి రాత్రి 8:30 గంటల మధ్య కళ్యాణ క్రతువు పూర్తి చేయనున్నారు. కళ్యాణ వేదికను ప్రత్యేక సాంప్రదాయ పుష్పాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమానికి లక్షల మంది భక్తులు తరలిరానున్నారు. దీనికి సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) అన్ని ఏర్పాట్లు చేసింది. స్వయంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో జె శ్యామలరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. ఈ కళ్యాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నారా భువనేశ్వరి దంపతులు హాజరు కానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. కళ్యాణ అనంతరం సీఎం దంపతులు ఒంటిమిట్టలోనే బస చేయనున్నారు. దీంతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. 2వేల మందితో భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నప్రసాదం, తాగునీరు, మజ్జిగతో పాటు కళ్యాణ అనంతరం భక్తులకు తలంబ్రాల ప్యాకెట్లు సిద్ధం చేశారు. మిగతా 2పేజీలో

## అభివృద్ధి పనులపై
# విజిలెన్స్ విచారణ

**సిమెంట్ రోడ్లు, వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులను పరిశీలన**



**పులివెందుల అర్బన్, మేజర్‌న్యూస్:** గత వైకాపా ప్రభుత్వ హయాంలో పులి వెందులలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఎన్డీయే ప్రభుత్వం విజి లెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో గురువారం విజిలెన్స్ అధికారులు బృందాలుగా ఏర్పడి పులివెందుల పట్టణంలోని నాక్ బిల్డింగ్, సిమెంట్ రోడ్లు, వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులను పరిశీలించారు. పులివెందుల నియోజకవర్గం లోని దాదాపు 350 అభివృద్ధి పనులను నాలుగు బృందాల చే విచారణ చేపట్టినట్లు సమాచారం. పాడా నిధులు దుర్వినియోగం అయ్యాయని ఫిర్యాదు మేరకు ఎన్డీఏ ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన విషయం విధితమే.

## నేడు సీఎం
# చంద్రబాబు రాక



**కడప బ్యూరో, మేజర్‌న్యూస్**

కడప జిల్లా ఒంటిమిట్ట కోదండ రామస్వామి కళ్యాణోత్సవంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 11న శుక్రవారం జిల్లాకు రానున్నారు. ప్రభుత్వం తరుపున స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. తరువాత రాత్రికి ఒంటిమిట్టలోనే బస చేస్తారని తెలుస్తోంది. ఆ మేరకు సీఎం షెడ్యూలు ఖరారైంది. ఈనెల 11వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుండి కడపకు బయలు దేరతారు. 4.30 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి మిగతా 2పేజీలో

## వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తో..
# జడ్పీ చైర్మన్ భేటీ




**కడప ప్రతినిధి – మేజర్ న్యూస్**

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కడప జిల్లా జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవింద రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. గురువారం విజయవాడలోని వైయస్సార్ పార్టీ కేంద్ర కార్యాలయంలో జిల్లా వైసీపీ నేతలతో కలసి ఆయన భేటీ అయ్యారు. మైదుకూరు మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి రెడ్డి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీ సతీష్ రెడ్డి, మాజీ రాయచోటి శాసనసభ్యులు శ్రీకాంత్ రెడ్డి, వైసీపీ యువ నాయకుడు ముత్యాల శ్రీనివాసులు రెడ్డి, మాజీ మిగతా 2పేజీలో

## శ్రీ సీతా రామస్వామి కళ్యాణం చూద్దాం రారండి!

(మొదటి పేజీ తరువాయి)



స్వామి వారి కళ్యాణ ఏర్పాట్లపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ఏకశిలానగరంలో ఏప్రిల్ 11న జరుగనున్న శ్రీ సీతారాముల కళ్యాణాన్ని టీటీడీ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో వైభవంగా నిర్వహిస్తాం. శ్రీ సీతారాముల కళ్యాణం సందర్భంగా ఏప్రిల్ 11న సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఉన్న 147 గ్యాలరీలలో 60 వేల మంది సౌకర్యవంతంగా కూర్చుని వీక్షించేందుకు ఏర్పాటు చేశాం. ప్రతి గ్యాలరీలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారామెడికల్, టిటిడి ఉద్యోగులు, పోలీసు, శ్రీవారి సేవకులు ఉండేలా చర్యలు చేపట్టాం. కళ్యాణ వేదిక ప్రవేశ ప్రారంభంలో తలంబ్రాలు పంపిణీ కోసం తొలిసారిగా ప్రత్యేకంగా 28 కౌంటర్లు ఏర్పాటు చేశాం. కళ్యాణోత్సవానికి విచ్చేసే ప్రతి భక్తుడికి ముత్యాల తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, కంకణం, అన్నప్రసాదాలు అందించేలా పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాం.- నడిచి వచ్చే భక్తుల సౌకర్యార్థం 11 ప్రాంతాలలో ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేశాం. ఇందులో పానకం, మజ్జిగ, చలివేంద్రం, వాటర్ కూలర్లు, పోలీస్, మెడికల్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఆలయ సమీపంలో 3 వేల మంది భక్తులు వేచి ఉండేందుకు, క్యూ లైన్లలో వెళ్ళేందుకు జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశాం. శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో ఉండే భక్తులతో పాటు, కల్యాణం వీక్షించేందుకు వచ్చిన భక్తులందరూ శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని వీక్షించేలా 23 ఎల్ ఈడీ స్క్రీన్ లు ఏర్పాటు చేశాం. టిటిడి విజిలెన్స్ విభాగం నుండి 400 మంది, జిల్లా పోలీస్ యంత్రాంగం నుండి 2500 మంది భద్రతా సిబ్బందిని నియమిస్తున్నాం. అదేవిధంగా 130 సిసి కెమెరాలు, 07 డ్రోన్ లు ఏర్పాటు.- కామన్ కమెండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాం. ఫైర్ ఇంజన్లు, డిజాస్టర్ మేనేజ్మెంట్ టీంలను ఏర్పాటు చేశాం. కళ్యాణానికి విచ్చేసి భక్తులు వాహనాల పార్కింగ్ కొరకు సాలాబాద్ వద్ద 2, సాయి నగర్ వద్ద 3 పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేశాం. సాలాబాద్ జంక్షన్ నుండి సాయినగర్ వరకు దాదాపు 21 కి.మీ మేర లైటింగ్, సూచిక బోర్డులు, మొబైల్ పెట్రోలింగ్, పర్యవేక్షణ టీంలు ఏర్పాటు చేశాం.

**అన్నప్రసాదాలు పంపిణీ...**

బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఉదయం నుండి రాత్రి వరకు ఆలయ ప్రాంగణంలో, కల్యాణ వేదిక వద్ద అన్నప్రసాద వితరణ జరుగుతుంది. కల్యాణాన్నీ వీక్షించేందుకు గ్యాలరీలలో వేచి ఉండే భక్తులకు సాయంత్రం నుండి లెమన్ రైస్, చక్కర పొంగలి, బిస్కెట్ ప్యాకెట్, కారాసు అందిస్తాం. దాదాపు 3 లక్షల తాగునీరు బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తాం.

**ప్రత్యేక బస్సు సౌకర్యం..**

ఆర్టీసీ ద్వారా కడప నుండి ఒంటిమిట్ట వరకు 85 బస్సులతో 425 ట్రిప్పులు, రాజంపేట నుండి ఒంటిమిట్ట వరకు 40 బస్సులతో 220 ట్రిప్పులు అనగా మొత్తం 645 ట్రిప్పుల ద్వారా భక్తులకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నాం. ట్రాఫిక్ డైవర్షన్ ప్రాంతాల నుండి కల్యాణ వేదిక వరకు టీటీడీ 20 ఉచిత బస్సులు ఏర్పాటు చేసింది. 13 వైద్య శిబిరాలు, 250 మంది పారామెడికల్ సిబ్బం, 35 మం వైద్య నిపుణులు, 8 అంబులెన్స్ లు, అగ్నిమాపక సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

**ప్రత్యేక పుష్పాలంకరణలు:-**

కల్యాణ వేదిక, ఆలయం, పరిసర ప్రాంతాల్లో 12 టన్నుల సాంప్రదాయ పుష్పాలు, లక్ష కట్ ఫ్లవర్స్ తో పుష్పాలంకరణలు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. కళ్యాణ వేదిక ఆలయ పరిసరాలలో 250 మరుగుదొడ్లు, టిటిడి జిల్లా యంత్రాంగం సమన్వయంతో 3,268 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తారు. అదేవిధంగా 500 మంది టీటీడీ డిప్యూటేషన్ ఉద్యోగులు, 2500 మంది శ్రీవారి సేవకులు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందిస్తారు. కాగా, శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తుల వీక్షించేందుకు వీలుగా హెచ్‌డి క్యాలిటీతో ప్రత్యక్ష ప్రసారం అందిస్తాం. అంతకు ముందు ఛైర్మన్ టీటీడీ, జిల్లా అధికారులతో కలిసి ఏర్పాట్లపై టీటీడీ ఛైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీ జె.శ్యామలరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేఈవో వీరబ్రహ్మం, జేసీ అదితి సింగ్, ఎస్పీ ఈజీ. అశోక్ కుమార్, సివిఎస్వో హర్షవర్ధన్ రాజు తదితర అధికారులు పాల్గొన్నారు.


## నేడు సీఎం బాబు రాక

(మొదటి పేజీ తరువాయి)

రోడ్డు మార్గాన ఒంటిమిట్ట టిటిడి గెస్ట్ హౌస్ కు చేరుకుంటారు. సాయంత్రం 5 గంటలకు ఒంటిమిట్ట కోదండ రామస్వామిని దర్శించుకుంటారు. సాయంత్రం 6 గంటల నుంచి 6:30 మధ్య కోదండ రామస్వామికి సీఎం దంపతులు ప్రభుత్వం తరుపున స్వామివారికి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు. 6:45 నుంచి 8:30 వరకు సీతారామ కళ్యాణోత్సవంలో పాల్గొంటారు. అక్కడి నునంచి రాత్రి 8:40కి తిరిగి టీటీడీ గెస్ట్ హౌస్‌కు చేరుకుని సీఎం దంపతులు అక్కడే రాత్రి బస చేయనున్నారు. తిరిగి 12వ తేదీ ఉదయం 9 గంటలకు ఒంటిమిట్ట నుంచి కడప విమానాశ్రయం చేరుకుని ఇక్కడి నుండి విజయవాడకు బయలుదేరి వెళ్తారని సమాచారం. ఈమేరకు సీఎం పర్యటన షెడ్యూలు ఖరారైంది. జిల్లా అధికార యంత్రాంగం సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే రాయలసీమ డీఐజీ ప్రవీణ్, ఎస్పీ అశోక్ కుమార్ ఒంటిమిట్టను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని జయప్రదం చేయండి

**దళిత నాయకులు**



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్లలో ఏప్రిల్ 14 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134 వ జయంతి పురస్కరించుకొని అంబేద్కర్ సర్కిల్ వద్ద అన్నదాన కార్యక్రమము, కోలాటం మరియు తదితర కార్యక్రమాలు ఘనంగా జరుపుటకు నాలుగు మండలాల దళిత సంఘం నాయకులు, ప్రజాసంఘం నాయకులు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం నాయకులు, కార్మిక సంఘం నాయకులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన సేవ సమితి, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రెటరీ ముత్యాల ప్రసాద్ రావు,బండి ఓబులేసు. కే రాఘవ, కిరణ్. పాపయ్య. టీచర్ జి శ్రీనివాసులు. పుల్లయ్య. చిన్న రాయుడు. చిన్న. రాజు. పుల్లయ్య. ఎల్ మల్లికార్జున. ఎన్ వీరయ్య. రాజు తదితరులు పాల్గొన్నారు.

## పౌర్ణమి సందర్భంగా రేపు చండీ హెూమం

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** పట్టణ నడిబొడ్డున వున్న అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం పూర్ణిమ సందర్భంగా చండీ హెూమం జరుగుతుందని ఆలయ ఈ.ఓ కే.రామచంద్రాచార్యులు, ఆలయ చైర్మన్ కొత్త మిద్దె రఘురామిరెడ్డి, పాలకమండలి సభ్యులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కావున ఆసక్తి ఉన్న భక్తులు ఈ హెూమాలు చేయించుకొని స్వామి అమ్మవార్ల అనుగ్రహం పొందగలరని సూచించారు.

## వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తో

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ సలహాదారుడు సంభటూరు ప్రసాద్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి దువ్వూరు గుడిపాటి బాబు కూడా ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ జిల్లా రాజకీయ పరిస్థితులపై ఆరా తీశారు. జిల్లాలోవైసీపీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా జగన్ సూచించారు. కూటమి ప్రభుత్వం వైసీపీ నేతలను వేధిస్తోందని అయినా ఎవరు భయపడవద్దని, ప్రతి కార్యకర్తకు, నాయకునికి అండగా ఉంటా నని జగన్ భరోసా ఇచ్చారు. నేతలందరూ సంఘటితంగా ఉండా లని సూచించారు.

## చెప్పింది కొండంత చేసింది గోరంత

**కూటమి ప్రభుత్వం పై విరుచుకు పడ్డ కడప జిల్లా వైకాప ఉపాధ్యక్షులు శశికాంత్‌రెడ్డి**



**పులివెందుల మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పింది కొండంత చేసింది గోరంత అని కడప జిల్లా ఉపాధ్యక్షుడు డివి శశికాంత్ రెడ్డి అన్నారు. గురువారం ఓ ప్రకటనలో విలేకరులకు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తొలి సంతకం మెగా డీఎస్సీపై అన్నారు. 11 నెలులు అయిన ఇంతవరకు నోటిఫికేషనే లేదు అన్నారు. లోకేష్ ప్రతి ఏడాదీ జాబ్ క్యాలెండర్ అన్నాడు ఇంతవరకు వదిలిందే లేదన్నారు. ఇంగ్లీష్, తెలుగు క్యాలెండర్లు వెళ్లిపోయాయి కానీ జాబ్ క్యాలెండర్ ఊసే లేదు అన్నారు. వాలంటీర్ వ్యవస్థ కొనసాగిస్తాం అన్నారు ఇంతవరకు చేసింది లేదన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు అన్నారు. 18ఏళ్ళు నిండిన ప్రతి మహిళకు 1500అని మాయ మాయమాటలు చెప్పి ఓట్లు వెయ్యించుకున్న గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన ఒక్క హామీ కూడా అమలు చేయకుండా అధికారాన్ని అనుభవిస్తూ కాలయాపన చేస్తుందన్నారు. ప్రజలకు ప్రభుత్వం బాధ్యతగా ఇవ్వాల్సిన విద్యా, వైద్యం, రోడ్లు, నీళ్లు కూడా ప్రైవేటు పరం చేయడం దారుణం అన్నారు.

## వారసత్వ సంపద సంరక్షణ..

(మొదటి పేజీ తరువాయి)

అకాడమీ మీటింగ్ హాలులో "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భౌగోళిక కార్యకలాపాలు" అనే అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి కేంద్ర గనుల మంత్రిత్వశాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా ఏడిజి (సౌత్ రీజన్) ఎస్.డి. పట్భజే, ఎపి టూరిజం ప్రాజెక్ట్స్ ఈడీ ఎం. శేషగిరి, రాష్ట్ర భూగర్భ గనుల శాఖ ఎడి డబ్ల్యు.బి. చంద్రశేఖర్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎడిజి జాన్విజ్ శర్మ, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ జెడిజి అరుణ్ శ్రీవాత్సవ, జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (క్యూరేటరల్) డిప్యూటీ డిజి స్నిగ్ధా ఘటక్‌లతో పాటు.. రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆడినరాయణరెడ్డి, జేసీ అదితిసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర గనుల మంత్రిత్వశాఖ కార్యదర్శి వి. ఎల్. కాంతారావు మాట్లాడుతూ.. గ్రాండ్ కన్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన గండికోట గార్జ్‌కు ప్రపంచ స్థాయిలో.. యునెస్కో గుర్తింపు ఆమోదం కోసం కేంద్ర జియోలజికల్ సర్వే ఆప్ ఇండియా ఉన్నతాధికారులు ప్రతినిధులుగా హాజరై ఇక్కడి వనరులు, భౌగోళిక స్థితిగతులు, సంస్కృతిక పరిస్థితులను పరిశీలించి యునెస్కో వారు సూచించిన ప్రమాణికాల ఆధారంగా నివేదికలను తయారు చేయడం జరుగుతుందన్నారు. గండికోట లోయ ప్రాంతంలో అరుదైన శిలాసంపద నెలవై ఉండడం గండికోట పర్యాటక వారసత్వ సంపదగా చెప్పవచ్చన్నారు. కాకపోతే.. సహజ వనరులను కాపాడుకోవడంలో స్థానికులు, ప్రజా ప్రతినిధులు, అధికారుల బాధ్యత కూడా ఎంతైనా ఉందన్నారు. పర్యాటక ప్రాంతాలు అనేవి పరిశుభ్రతతో పాటు, ఆరోగ్యవంతంగా వుండేలా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటక ప్రదేశాలు కేవలం ఆదాయ వనరుగానే కాకుండా.. భౌగోళిక వారసత్వ సంపదను కాపాడుకునే. లోగిల్లుగా కూడా ఉండాలన్నారు. కాగా అత్యంత ప్రాచీన చారిత్రక ప్రాచుర్యం పొందిన పర్యాటక ప్రాంతమైన "గండికోట పర్యాటక కేంద్రం" భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక రంగాన్ని శాసిస్తుందనడంలో అతిశయోక్తి లేదన్నారు. గండికోట యొక్క అసాధారణమైన సహజ అందాలు మానవ శాస్త్ర కార్యకలాపాల ద్వారా నాశనం కాకూడదని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశంలోని జియోహెరిటేజ్ సైట్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'భువిరాసత్' సైట్ ద్వారా కూడా ఇక్కడి ప్రత్యేకతలను అప్ లోడ్ చేస్తూ.. మన పర్యాటక వారసత్వ సంపదను ప్రపంచానికి తెలియజేయవచ్చున్నారు. భారత దేశం అంతటా అన్ని జియోహెరిటేజ్ సైట్ల పరిరక్షణ కోసం కొత్త



జియోహెరిటేజ్ చట్టం గురించి కూడా ఆయన వ్యాఖ్యానించారు.

**గండికోట ను పూర్తిస్థాయి అభివృద్ధి చేస్తాం...**

రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ... 900 సంవత్సరాల క్రిందట నిర్మించబడిన గండికోట, జైనులు కూడా పాలించిన ప్రాంతంగా చరిత్ర చెబుతోందన్నారు. అతి పురాతన చారిత్రక వైభవం ఉన్న ఈ కోట సమీపంలోని పెన్నా నదీ లోయ ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 విధానం ద్వారా గండికోట పర్యాటక ప్రాంతాన్ని మరింత అభివృద్ధి లోకి తీసుకువస్తాం అన్నారు. ప్రస్తుతం గండికోట పరిసర ప్రాంతాల్లో అపారమైన ఆదాయాన్నిచ్చే ఆర్థిక వనరులైన పరిశ్రమలు, పవర్ ప్రాజెక్టులు, సంస్కృతులు, సంప్రదాయాలు, పర్యావరణ, ప్రకృతి వనరులు పుష్కలంగా ఉన్న ఈ ప్రాంతానికి యునెస్కో గుర్తింపును ఇవ్వాలని జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధులను కోరారు. సమీక్ష సమావేశంలో.. జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా యునెస్కోలో ఆమోదం పొందేందుకు కావాల్సిన అర్హతలు, ప్రమాణికాలు.. సంబంధిత విషయాలను వివరించగా, పర్యాటక శాఖకు సంబంధించిన వివరాలను టూరిజం శాఖ ప్రతినిధులు వివరించారు. అంతకు ముందు కేంద్ర గనుల మంత్రిత్వశాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతారావు గండికోట సమాచార ప్యానెల్ బోర్డును ఆవిష్కరించిన అనంతరం గండికోట గార్జ్ పరిసర ప్రాంతాలు, గండికోట పోర్టులోని వివిధ సందర్శనీయ ప్రదేశాలను జియోలజికల్, ఆర్కియాలజికల్, టూరిజిమ్ శాఖ అధికారులతో కలిసి తిలకించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, జమ్మలమడుగు తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, సంబందిత శాఖల అధికారులు, కన్సల్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల కూటమి ప్రభుత్వంలో నెరవేరేనా ?

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్డమాను వీరశేఖర్




**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్లలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద పేదవా డికి సొంత ఇంటి కల నెరవేర్చడం కోసం, సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు వీరశేఖర్, మాట్లాడు తూ పేదవాడి ఇళ్ల గురించి గొప్పగా చెప్పే కూటమి ప్రభుత్వం కాలయాపన చేయకుండా చిత్త శుద్ధితో పరిష్కరించాలని వారన్నారు.అలాగే అర్హులైన వారందరికీ రెండు సెంట్ల ఇళ్ళ స్థలాలు, ఇల్లు, భూ అక్రమ దారుల నుండి భూమి స్వాధీనం చేసుకొని బంజర భూమి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అర్హత కలిగి ఇళ్ళు లేని ప్రతి పేదవాడికి పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇండ్ల స్థలం మంజూరు చేసి, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. సచివాలయాల్లో ఇచ్చిన 350 అప్లికేషన్లను పరిశీలించి అర్హుల జాబితా తయారుచేసి , కుటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకునే ప్రభుత్వం అని నిరూ పించుకోవాలని వారన్నారు. అదేవిధంగా తిరుపతి రెడ్డి కాలనీ వాసులకు జీవో నెంబర్ 30 ప్రకారం క్రమబద్ధకరించి వెంటనే ఇంటి పట్టాలు మంజూరు చేసి, మౌలిక సదుపాయాలు కల్పించాలని వారన్నారు. పేదవాడి ఇంటి కళ నెరవేరేంతవరకు సిపిఐ రాష్ట్రవ్యాప్తంగా అలుపె రగని పోరాటం చేస్తుందన్నారు. అలాగే ఇంటి పట్టాల సాధన కోసం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు, ఆర్డీవో ఆఫీస్ వద్ద ధర్నా, నియోజకవర్గాల వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో జరుగుతున్న కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్దిష్ట సమయాన్ని కేటాయించుకుని ప్రజలకు, పట్టాలు పంపిణీ చేయాలని వారు కోరారు. లేనిపక్షంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, సిపిఐ మండల కార్యదర్శి రవికుమార్, కార్యవర్గ సభ్యులు పివి రమణ, కేశవ,సలమాల చెన్న య్య, సునీల్, ప్రసాద్, మండల నాయకులు రవీంద్ర, శ్రీనివాసులు షాహిదా, విశ్వాసమ్మ తదిత రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కడప స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్

**కడప క్రైమ్ - మేజర్‌న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా కడప స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా ఉన్న ఆర్ వాసుదేవన్ ను అనంతపురం పిటిసి డీఎస్పీగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఎన్ సుధాకర్ ను కడప స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా నియమించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు.

## ఏప్రిల్ 30 లోపు చెల్లించి పన్ను రాయితీ పొందాలి - కమిషనర్ మల్లికార్జున

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** నెలాఖరు లోపు పన్ను చెల్లించి రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురపాలక సంఘానికి సంబంధించిన ఆస్తి పన్ను మరియు ఖాళీ స్థలముల పన్నులు ఏప్రిల్ 30వ తేదిలోపు చెల్లించినచో వడ్డిలో 50 శాతం రాయితి అందిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసిందని వివరించారు. కావున ప్రొద్దుటూరు పురపాలక సంఘ పరిధి లోని పన్ను బకాయి దారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని పన్ను చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధి సహకరించాలని కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ఆస్థి పన్నులు ఈ నెలాఖరు లోపు ఏక మొత్తంగా చెల్లించిన వారికి ఆస్థిపన్నులో 5 శాతము రాయితి కలదని, కావున పన్నులు ఆన్లైన్ నందు గాని లేదా పురపాలక సంఘం నందు గల పౌర సేవా కేంద్రము గాని చెల్లించ వచ్చునని సూచించారు. పురసేవ కేంద్రం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని, సెలవు దినాలలో కూడా పన్నులు చెల్లించవచ్చని వివరించారు.

# భారత రాజకీయ కార్యకర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు కస్తూరి బాయ్ గాంధీ

### నేడు కస్తూరి బాయ్ గాంధీ జయంతి



ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్: కస్తూరిబాయి మోహన్‌దాస్ గాంధీ (1869 ఏప్రిల్ 11 - 1944 ఫిబ్రవరి 22) భారత రాజకీయ కార్యకర్త, మహాత్మా గాంధీకి భార్య. ఆమె తన భర్త ప్రోత్సాహంతో, కుమారునితో పాటు భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నది. ఆమె 62 సంవత్సరాల పాటు గాంధీతో కలసి జీవించింది. దక్షిణాఫ్రికా ప్రవాస భారతీయుల జీవన పోరాటంలోనూ, భారత స్వాతంత్ర్యోద్యమంలోనూ పాల్గొని నిర్బంధాలను కలిసి ఎదుర్కొన్నది. భారత దేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వమే పూణే లోని ఆగా ఖాన్ ప్యాలస్ లో 1944 ఫిబ్రవరి 22న కన్నుమూసింది. గుజరాత్ రాష్ట్రం కాఠియావాడ్ ద్వీపకల్పంలోని పోర్‌బందర్‌లో సంపన్న మోద్ బనియా వైశ్య కుటుంబంలో 1869 ఏప్రిల్ 11న జన్మించింది. ఆమె తల్లి వ్రజకున్వర్‌బా కపాడియా, తండ్రి గోకుల్ దాస్ మాకన్‌జీ కపాడియా. కస్తూరిబా పూర్తిపేరు "కస్తూర్ గోకుల్ దాస్ మాకన్‌జీ కపాడియా". గోకుల్ దాస్ అనేది తండ్రి పేరు. మాకన్‌జీ అనేది తాత పేరు. కపాడియా అనేది వారి ఇంటి పేరు. అంతకు ముందు ఇద్దరు ఆడపిల్లలు పుట్టి చనిపోవడం వల్ల కపాడియా దంప తులు కస్తూర్‌ని చాలా శ్రద్ధ తీసుకొని పెంచారు. ఆమెకి ఒక అన్న, ఒక తమ్ము డు ఉన్నారు. ఇరవై గదులతో కూడిన రెండు అంతస్తుల కపాడియాల ఇంటికి సొంతంగా ఒక మంచినీటి చెరువు కూడా ఉండేది. ఆడపిల్లలు చదువు కోవడం, మగ పిల్లలతో కలసి ఆడుకోవడం పోర్‌బందరు బనియాలలో చాలా దోషం. అంతే కాదు ఏడేళ్ళు దాటగానే పెళ్ళి చేయడం సంప్రదాయం. అందు వల్ల ఆమె నిరక్షరాస్యురాలిలానే పెరిగింది. ఆమె తాత మాకన్‌జీ కపాడియా ఎగుమతి, దిగుమతుల వ్యాపారం చేసేవాడు. సూయజ్ కాలువ త్రవ్వకంతో ఐరోపా నుండి భారతదేశం రావడానికి నౌకల ప్రయాణ కాలం తగ్గడంతో ఐరోపా దేశాలతో వ్యాపారం పెరిగింది. గోకుల్‌దాస్ కపాడియా పోర్‌బంద రుకు మేయర్ అయ్యాడు. అతని ఇంటి ప్రక్కనే దివాను కరంచంద్ గాంధీ ఇల్లు కూడా ఉండేది. పోర్‌బందర్ ను పాలించే "రానా విక్మత్‌జీ" సంస్థానానికి కరంచంద్ గాంధీ దివాన్‌గా ఉండేవాడు. కరంచంద్ గాంధీ ఇల్లు 12 గదులతో మూడు అంతస్తుల భవనం. ఆ ఇంటికి సొంత మంచినీటి చెరువు తో పాటు ఆటస్థలం కూడా ఉండేది. ఆ ఆటస్థలంలో కస్తూర్బా, మోహన్ దాస్ కరం చంద్ గాంధీలు బాల్యంలో ఆడుకొనేవారు. ఆ ఆట స్థలంలో వివాహానికి ముందే చిన్నప్పుడు కస్తూర్ తో కలిసి ఆడుకున్న జ్ఞాపకాల గురించి గాంధీ తన శిష్యురాలు డాక్టర్ సుశీలా నయ్యర్‌కి చెప్పారు. 1876లో పదేళ్ళ వయసులో మోహన్‌దాస్ గాంధీ - కస్తూర్ కపాడియాల నిశ్చితార్థం జరి గింది. పిల్లలకు పదమూడో ఏట వివా హం జరిపాలని కపాడియా - గాంధీ కుటుంబాలు నిర్ణయించాయి. 1882 లో వారి వివాహం సాంప్రదాయ హిందూ వివాహ పద్ధతిలో జరిగింది. వారు భార్యా భర్తలుగా 62 సంవత్సరాల పాటు కలసి జీవించారు. కస్తూర్ మోహన్ దాస్ నిశ్చితార్థం నాటికి కఠియావాడ్ రాజ్యాలను పర్యవేక్షించే బ్రిటిష్ పొలి టికల్ ఏజెంటు ఫెడరిక్ లెలో పోర్‌బందర్ దివాన్ పదవి నుంచి కరంచంద్ గాంధీని తొలగించారు. కరంచంద్ గాంధీ తన తమ్ముడు తులసీ దాస్‌ని పోర్‌బందర్ సంస్థానం దివాన్ పదవిలో ప్రవేశపెట్టి తాను రాజ్‌కోట్ సంస్థా నానికి మకాం మార్చాడు. అక్కడ రెండేళ్ల పాటు సలహాదారుడిగా ఉంటూ తర్వాత దివాన్ పదవిలో కుదు రుకున్నాడు. అందువల్ల గాంధీ కుటుంబం పోర్ బందరు నుండి రాజ్‌కోట్‌కు మారాల్సి వచ్చింది. వివాహానంతరం కస్తూర్బా గాంధీ అనే కొత్త పేరుతో రాజ్‌కోట్ లోని గాంధీల కొత్త ఇంట్లోకి ఆమె ప్రవేశించింది. పెళ్ళి తరువాత అమ్మాయిల పేరుకి భర్త ఇంటిపేరుతో పాటు "బా" అనే మాట చేర్చడం ఆనవాయితీ. "బా" అంటే గుజరాతీ భాషలో అమ్మ అని అర్థం.

## ఈనెల 13వ తేదీన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష

**జమ్మలమడుగు, మేజర్‌న్యూస్ :** పెద్దముడియం మండలంలోని గుండ్లకుంట గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతికి ప్రవేశానికి దరఖాస్తు చేసిన విద్యార్థులు ఈనెల 13వ తేదీన అనగా ఆదివారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వర కు ప్రవేశ పరీక్ష మొదలవుతుందని ఆ పాఠశాల ప్రిన్సిపల్ ప్రభావతి తెలిపారు. కావున ఐదవ తరగతికి అప్లై చేసిన ప్రతి విద్యార్థి తప్పక హాజరు కావాలని, అలాగే విద్యార్థులు తమ వెంట ఒరిజినల్ ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, పెన్ను ,ప్యాడు ఇతర సామాగ్రి తమ వెంట తెచ్చుకోవాలని ఆమె తెలిపారు.

## ఆర్టీసీ డ్రైవర్ పై దాడి చేశాడని కేసు నమోదు.

పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ : పోరుమామిళ్ల మండలం చిన్న కప్పలపల్లె గ్రామానికి చెందిన బాలవర్ధిరాజు ఏపీఎస్ ఆర్టీసీలో డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. అందులో భాగంగా గురువారం ఉదయం ఏపీ21- %%-0708 నంబర్ గల బస్సును డ్రైవర్ రాజు పోరుమామిళ్ల నుండి కడపకు తీసుకొని వెళుతుండగా నర్సింగుపల్లె దగ్గర నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున బస్సు వెనకాల ద్విచక్ర వాహనం పై వస్తున్న కాశినాయన మండలం సిద్దాయపల్లె గ్రామానికి చెందిన సుబ్బరాయుడు బస్సు డ్రైవర్ చేతితో చేసిన సంకేతాలు తప్పుగా అర్థం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపై అడ్డంగా ఆపి డ్రైవర్ ను సుబ్బరాయుడు దాడి చేశాడని శుక్రవారం పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, పోరుమామిళ్ల ఎస్ఐ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ దుర్గామోహన్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# నకిలీ దేశభక్తితో ప్రజలను మోసగిస్తున్న బిజెపి. ఆర్ఎస్ఎస్

### న్యాయమార్గమే కాంగ్రెస్ లక్ష్యం – నకిలీ దేశభక్తితో ప్రజలను మోసగిస్తున్న బీజేపీ-ఆర్.ఎస్.ఎస్.
### డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి



కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ : గురువారం కడప నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి మాట్లాడుతూ అహ్మదాబాద్లో ముగిసిన 86వ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పలు కీలక తీర్మానాలను ప్రకటించింది. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ ప్రధాన ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా వారు, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణపై కాంగ్రెస్ పార్టీ యొక్క నిబద్ధతను స్పష్టంగా వెల్లడించారు. కుల గణన నిర్వహణపై గట్టి డిమాండ్: సమాజంలో సామాజిక న్యాయం అమలు కావాలంటే కుల గణన అత్యవసరం. 50% రిజర్వేషన్ పరిమితిని తొలగించాలన్న డిమాండ్ను పునరుద్ఘాటించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని, ఇది మత స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు. సమాజంలో ధార్మిక గందరగోళాన్ని పెంచే ప్రయత్నం: ముస్లింలు మరియు క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని వారి జీవితాలను భయభ్రాంతుల్లోకి నెట్టడం పెద్ద నేరమని రాహుల్ గాంధీ విమర్శించారు. సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు పార్లమెంట్లో డ్రామాలు: దేశానికి ఎదురవుతున్న అసలు సమస్యలపై చర్చకు మళ్లించకుండా బీజేపీ ప్రభుత్వం కల్పిత వ్యవహారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని విమర్శించారు. రాహుల్ గాంధీ కీలకంగా ప్రకటించిన అంశం: ఇకపై కాంగ్రెస్ పార్టీకి బలమైన ఆధారంగా జిల్లా కాంగ్రెస్ కమిటీలు (డిసిసి) మరియు జిల్లా స్థాయి నాయకత్వం నిలవాలని, అదే పార్టీ నిర్మాణానికి మూలస్తంభంగా మారాలని తెలిపారు.ఈ సమావేశంలో "న్యాపథ్" (న్యాయ మార్గం) అనే పేరుతో తీర్మానం ఆమోదించబడిందన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశభక్తి భావన అనేది ప్రజలను ఏకం చేసే విలువలపై ఆధారపడి ఉంది. మిగిలినవారు ప్రదర్శించే నకిలీ దేశభక్తి ప్రజలను విభజించే ఆలోచనలతో నిండి ఉందన్నారు. సెక్యులరిజం పట్ల కాంగ్రెస్ నిబద్ధత భారతదేశ పౌరాణిక సంస్కృతి నుండి స్ఫూర్తి పొందిందన్నారు.సారాంశంగా చెప్పాలంటే, సామాజిక న్యాయం, మత స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ధైర్యంగా నిలుస్తుందని ఈ సమావేశం నిరూపించింది. దేశాన్ని విభజించే బీజేపీ విధానాలను ప్రజలు గుర్తించాలనే విజ్ఞప్తిని ఏఐసీసీ చేసిందన్నారు. విలేకరుల సమావేశంలో కడప అసెంబ్లీ సమన్వయకర్త బండి జకరయ్య, నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, సయ్యద్ గౌస్ పీర్ ,అబ్దుల్ సత్తార్, మైనుద్దీన్, సంజయ్ కాంత, హమీద్, ఖాదర్ ఖాన్, రహమతుల్లా ఖాన్, షేక్ నీలం, సిరాజుద్దీన్, కమల్ బాషా, ముబారక్, హరిప్రసాద్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయండి

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప ప్రతినిధి – మేజర్‌న్యూస్ : ఒంటిమిట్టలో జరిగే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. గురువారం ఒంటిమిట్ట టిటిడి కళ్యాణ మండపం సమీపంలోని పరిపాలన భవన సమావేశ మందిరంలో టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు, టిటిడి ఈఓ శ్యామల రావు, టీటీడీ జెఈఓ వీరబ్రహ్మం, తిరుమల విజిలెన్స్ ఎస్పి హర్షవర్ధన్ రాజు, ఎస్పీ అశోక్ కుమార్, జేసీ అదితి సింగ్‌లతో కలిసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులు, టీటీడీ అధికారులతో కలెక్టర్ సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సమన్వయంతో చేయాలన్నారు. భద్రతలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. కళ్యాణ మహోత్సవ ప్రాంతాన్ని 16 సెక్టార్లుగా ఏర్పాటు చేసి సీనియర్ అధికారులను నియమించామని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా, టీటీడీ, పోలీస్ అధికారులు సంయుక్తంగా, నిర్దిష్ట ప్రణాళికలతో విధులు నిర్వహించాలన్నారు. కళ్యాణ ప్రాంగణంలో 22 ఎల్ఈడి స్క్రీన్స్, రెండు పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేశామని వాటి భద్రత ఏర్పాట్లు చూసుకోవాలని అధికారులకు సూచించారు. గతంలో జరిగిన పరిణామాల దృష్ట్యా ఎప్పటికప్పుడు అధికారులు గాలి,వానల పట్ల అప్రమత్తంగా ఉండి ఎమర్జెన్సీ టీములు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. క్రిటికల్ పాయింట్స్ అయినా ఎంట్రీ మార్గాలలో జనం తొక్కిసలాట జరుగకుండా అధికారులు, పోలీస్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రసాదం కౌంటర్ల వద్ద ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతిఒక్కరికీ తాగునీరు, అన్నప్రసాదం కొరత లేకుండా అందేలా చూడాలన్నారు. అలాగే ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు కావాల్సిన అన్ని రకాల మౌలిక, కనీస వసతులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలన్నారు. భద్రతా ఏర్పాట్లు, శానిటేషన్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, తాగునీరు, భక్తులకు అన్నప్రసాదాలు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ కంట్రోల్, ఆర్టీసీ



రవాణా సౌకర్యం, సూచిక బోర్డులు ఏర్పాటు, కంట్రోల్ రూం ఏర్పాటు, సీసీ కెమెరాలు, విద్యుత్, అగ్నిమాపక వాహనాలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, 108 వాహనాలు, అత్యవసర మందులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, తాత్కాలిక మెడికల్ క్యాంపులు, అక్కడక్కడ హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు మొదలైన అన్ని అంశాలను ఎలాంటి కొరత లేకుండా.. చూసుకోవాలని సంబందిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సాయంత్రం కళ్యాణ మహోత్సవం జరిగే ప్రాంగణంలో విద్యుత్, వైద్య ఆరోగ్య అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్ సెక్టార్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గ్యాలరీల వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ లో టిటిడి బిఆర్ నాయుడు, టిటిడి ఈఓ శ్యామల రావు, టీటీడీ జెఈఓ వీరబ్రహ్మం,జేసీ అదితి సింగ్ లు పాల్గొన్నారు. మాక్ డ్రిల్ అనంతరం టిటిడి బి.ఆర్ నాయుడు, టిటిడి ఈఓ శ్యామలరావుతో కలిసి జిల్లా కలెక్టర్ గ్యాలరీలు, ఎంట్రీ పాయింట్లు, ప్రసాదాల కౌంటర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, చంద్రమోహన్, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి,డిఆర్డీఏ పీడి ఆనంద్ నాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, డిఎంహెచ్ఓ డా.నాగరాజు, సిపిఓ వెంకటరావు, డీపీఓ రాజ్యలక్ష్మి, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఏపిఎస్పిడిసిఎల్ ఎస్ఈ రమణయ్య, డిటిసి, ఆర్టీసీ అధికారులు, టిటిడి, ఈ,పీఆర్ పిఆర్వోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీజీబీని అమరావతికి తరలించవద్దు

## రాయలసీమ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయొద్దు.
## ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి




కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించవద్దని, ఇప్పటికే రాయలసీమలో ఉన్న అనేక సంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించి రాయలసీమను కరువు నేలగా మార్చారని, అక్కడక్కడ ఉన్న అరాకోర సంస్థలను కూడా అమరావతికి తరలించి సీమను పూర్తి ఎడారిగా మార్చాలని చూస్తున్నారా?అని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మరియాపురంలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయం ముందు అన్నీ అమరావతి కేనా? ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలించవద్దు అన్న గోడ పత్రాలను ఆవిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని ఒక దుర్మార్గపు ఆలోచన రాష్ట్రంలో నడుస్తుందని, రాష్ట్ర నలుమూలల ఉన్న, అన్ని ప్రధాన కార్యాలయాలు అమరావతిలోనే ఉండాలని ఉద్దేశంతోనే కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తున్నారని, ఇలా ఏ రాష్ట్రంలోనూ, దేశంలోనూ అన్ని ప్రధాన కార్యాలయాలు రాజధానిలో లేవని, ఢిల్లీలో కూడా అన్ని ప్రధాన కార్యాలయాలు లేవని, మన ప్రక్కనే కర్ణాటకలో కూడా రూరల్ బ్యాంకు ప్రధాన కార్యాలయం రాజధాని ప్రాంతంలో లేదని ఆయన గుర్తు చేశారు. బళ్లారిలో ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. జగన్ మీద ఉన్న కోపంతోనే కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతి తరలిస్తున్నారని ఈ బ్యాంకు ఎక్కువ కస్టమర్లు కలిగి, ఎక్కువ మందికి లోన్లు ఇవ్వడంలో అగ్రగామి గా ఉన్న ఏకైక బ్యాంక్ అని, ఏపీజిపి అన్ని బ్యాంకులతో పోల్చితే కడప బ్యాంకు లోనే ఎక్కువ డబ్బులు నిలువ, సొంత భవనము కలిగిన బ్యాంక్ అని ఇలాంటి బ్యాంకులు తరలించడం కక్ష సాధింపే నని ఆయన మండపడ్డారు. ఏపీజీపీని అమరావతికి తరలిస్తున్నామన్న నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని, కడపలో ఉన్న బ్యాంకును తరలించడం అంటే! రాయలసీమ ప్రజల ఆత్మ గౌరవాన్ని తరలించడమేనని! భవిష్యత్తు రోజుల్లో రాయలసీమ అభివృద్ధి చెందుతుంది అన్న ఆకాంక్షను తరలించకపోవడమేనని, సీమలో ఉన్న అన్ని సంస్థలను అమరావతికి తరలించి సీమను పూర్తిగా ఎడారిగా మారుతుంది అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని ఆయన ప్రశ్నించారు. భవిష్యత్తు రోజుల్లో సీమలో ఉన్న కలిసొచ్చే పార్టీలు ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న ప్రజలు

## సిలెండర్ పై 50 రూ"పెంపు సమంజసమా ! ఏపీ లోనే పెట్రోల్ డీజిల్ ధరలు అధికం.
## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి.

**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** గ్యాస్ సిలెండర్ రేట్లు, నిత్యవసర సరుకుల ధరలు, పొరుగు రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ లోనే పెట్రోల్, డీజిల్ పెంచడం ఎంతవరకు సమంజసం అని పోరుమామిళ్లలోని వైఎస్ఆర్సిపి కార్యాలయంలోవ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. సామాన్యుడి వంటింట్లో గ్యాస్ ధరలు మంటలు పుట్టిస్తున్నా యన్నారు. గత కొన్ని రోజులుగా వాణిజ్య సిలెండర్ ధరలను పెంచుతూ వస్తున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగదారులకు వాత పెట్టిందన్నారు. వంట గ్యాస్ ధరను కేంద్రం రూ 50 పెంచి పేద, సామాన్య జనం నడ్డివిడిచిందన్నారు. ఉజ్వల్ యోజన పథకం క్రింద అందచేసే సిలెండర్ పై కూడా రూ 50 భారాన్ని మోపారాన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రవేశపెట్టిన దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు చాలామందికి అందడం లేదన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నట్టు ప్రకటించారని, ముందుగా వినియోగదారులు సిలిండర్ ధర ఏజెన్సీలకు చెల్లించాలని, రెండు రోజుల్లో ఆ డబ్బులు మొత్తం సబ్సిడీ కింద వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారన్నారు. ఈ మేరకు తొలివిడత కింద ఇప్పటివరకూ ముప్పై, నలభై శాతం మందికి రాయితీ డబ్బులు వారి ఖాతాకు జమ కాలేదన్నారు. తొలి సిలిండర్ సరఫరాకు మార్చి 31 న గడువు ముగిసిందని, ఏప్రిల్ 1 నుంచి రెండవ సిలెండర్ పంపిణీ పక్రియ మొదలైందన్నారు. మొదటి సిలిండర్ సబ్సిడీ తమకు వర్తిస్తుందో లేదోనని మిగిలిన వినియోగ దారులు ఆందోళన చెందుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గారు కోరారు.



**మన రాష్ట్రంలో అత్యధికంగా పెట్రోల్, డీజిల్ ధరలు.**

దేశంలోనే అత్యధికంగా పెట్రోల్ ,డీజిల్ రేట్లు మన రాష్ట్రంలోనే అధికంగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ లో లీటర్ పెట్రోల్ ధర రూ 109.22, కర్ణాటక లో లీటర్ పెట్రోల్ ధర 102.92, తమిళనాడు లో లీటర్ పెట్రోల్ ధర రూ 101.84 ఉందన్నారు. పొరుగు రాష్ట్రాలలో మనకంటే తక్కువ రేట్లు వున్నాయన్నారు. ఎన్నికల సమయంలో అన్ని రాష్ట్రాల కన్నా డీజిల్,పెట్రోల్ ధరలు రూ 10 తగ్గిస్తామని చెప్పిన కూటమి పెద్దలు చెప్పారని, ఆ మేరకు కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఎమ్మెల్సీ కోరారు.

# పది నెలలు అయినా హామీల అమలు శూన్యం

## వైసీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి




**కడప – మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలైనా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీలను నెరవేర్చకుండా చేతులెత్తేశారని వైసీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఈ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి దాదాపు 10 పది నెలలుగా కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా చేతులెత్తేశారని అన్నారు. ఇచ్చిన ఒక హామీ ఇవ్వకుండానే లక్షా 60 వేల కోట్లు అప్పు చేశారన్నారు. అంతేకాకుండా పెట్రోలు డీజిల్ రేట్లను మంగళవారం నుంచి ప్రతి లీటర్ పై 2 రూపాయలు పెంచారన్నారు. గ్యాస్ సిలిండర్ల పై 50 రూపాయలు పెంచారన్నారు. వైఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వంలో పెంచిన భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించడం జరిగిందన్నారు. సంపద సృష్టి అంటే బ్యాంకులలో అప్పు తేవడమా అని ప్రశ్నించారు. మాటలు కోటలు దాటుతున్నాయని చేతలు మాత్రం శూన్యమని విమర్శించారు. పి4 కొత్త స్కీమ్ మాటలు కోటలు బాటుతున్నాయి గాని చేతలు మాత్రం గడప దాటకుండా ఉన్నాయి. రాష్ట్రంలో 6 కోట్ల మంది జనాభా ఉంటే ఈ సంవత్సరంలో కేవలం 5 లక్షల మందికి మాత్రమే ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి నుంచి కింద మంత్రులు, ఎమ్మెల్యే ల వరకు ఆఖరికి కింద స్థాయి కార్యకర్తల వరకు దోచుకుంటున్నారని అన్నారు. కమలాపురం నియోజకవర్గంలో కూడా కొన్ని వందల ఇసుక టిప్పర్లు బయటికి విచ్చలవిడిగా తరలిస్తున్నారని అన్నారు. ఎక్కడ చూసిన మద్యం విచ్చలవిడిగా అమ్ముతున్నారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు పులి సునీల్, శ్రీను, త్యాగరాజు, ఇలియాస్, షఫీ పాల్గొన్నారు.

# ఘనంగా దంతలూరు కృష్ణ జన్మదిన వేడుకలు

**పులివెందుల, మేజర్‌న్యూస్ :** వైకాపా నాయకులు దంతలూరు కృష్ణ జన్మదిన వేడుకలను అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మారుతి థియేటర్ సమీపంలో ఉన్న దంతలూరు కృష్ణ నివాలసంలో అభిమానులు బాణాసంచా పేలుస్తూ తమ అభిమానాన్ని చాటు కున్నారు. ఆయన నివాసంలో నిర్వహిస్తున్న జన్మదిన వేడుకలకు అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు ఈ సందర్భంగా జన్మదిన కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. దంతలూరు కృష్ణ ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొర్రపాటి నవీన్, శేఖర్ రెడ్డి, భూపాల్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి, హరికుమార్,షామీర్, శ్రావణ్ కు మార్ రెడ్డి, బాబా యాపిల్, రామాంజనేయులు రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, ఇంద్ర,అబ్దుల్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



# బువ్వ పెట్టని బుర్రకథ

## కాలక్రమేనా అంతరిస్తోన్న కళా రంగం



పులివెందుల మేజర్ న్యూస్ కళారంగంలో ఒకటైన బుర్రకథ నేటి కళాకారులకు నిరాశ స్వాగత హస్తం చూపుతోంది. నేటి నవీన యుగంలో ఆదరణ కోల్పోవడంతో తరతరాలుగా వస్తున్న సంప్రదాయ కళారంగం కాలక్రమేనా అంతరిస్తోంది. వీటిపై ఆధార పడిన కళాకారులు నిరాశ్రయులవుతున్నారు. వివిధ మాధ్యమిక ప్రసారాల ద్వారా ఎప్పటికప్పుడు క్షణాల మీద తాజా సమాచారం అందుతుం డడంతో బుర్ర కథలు వంటివి కనుమరుగవుతున్నాయి. ఒకానొకప్పుడు బుర్రకథ, హరికథ, ఒగ్గు కథ, సుద్దులు వంటి కార్యక్రమాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. నేడు వీటికి ఆదరణ కోల్పోవడంతో వాటిపై ఆధారపడి జీవనం సాగించిన కళాకారులు ఇతర వాటిపై మొగ్గు చూపుతున్నారు. మరికొందరు పూర్తిగా వదిలేశారు. బుర్రకథ అనేది ఒక జానపద కళారూపం. ఇందులో పల్లెపదాలు, వంత హాస్యాలు, బిగువైన కథనాలు, పద్యాలు, పాటలు అన్నిటినీ కలుపుకొంటూ సరదా సరదాగా సాగిపోయే కళారూపం. పరిమితమైన ఆహార్యంతో, ఆడుతూ పాడుతూ హాస్యోక్తులు పలుకుతూ జన సామాన్యానికి చేరువగా వెళ్లే కళారూపాలలో హరికథ మొదటిది అయితే బుర్రకథ రెండవది. హరికథలో కొంత సంప్రదాయముద్ర ఉండి బుర్రకథ పూర్తిగా జానపద కళారూపం. తెలుగునాట జానపద వినోదగాన ప్రక్రియలలో ప్రబోధానికీ, ప్రచారానికీ సాధనంగా ఈ నాటికీ విస్తృతంగా ఉపయోగపడే కళారూపం బుర్రకథ. కథకుని చేతిప్రక్రియ ఇది. ప్రదర్శన సౌలభ్యాన్నిబట్టి, వీర గాథలు, త్యాగమూర్తుల కథలు బుర్ర కథల ఇతివృత్తాలుగా బాగా పేరు కొన్నాయి. ఈ ప్రక్రియ ప్రచార సాధనంగా ఎంతగానో ఉపకరిస్తోంది. కుటుంబ నియంత్రణ, రాజకీయ ప్రచా రము, ప్రజలను విజ్ఞానవంతులను చేయడము వంటి కార్యక్రమాలలో దీన్ని బాగా వాడుకున్నారు. జంగంకథ, పంబలకథ, జముకులకథ, పిచ్చుకుంట్ల కథ, తరువాతవచ్చింది. డాలు, కత్తితో పాడే ప్రధాన కథకుడికి పిచ్చిగుంట్ల కథలో ఇద్దరు వంతలున్నట్లే బుర్రకథలోకూడా ఉంటారు. దీనికి మాన్యత కల్పించి పద్మశ్రీ బిరుదు సంపాదించుకున్నవారు షేక్‌నాజర్. పేరునుబట్టి వీరు ఇస్లాం మతానికి చెందిన వారైనా చెప్పిన కథలలో ఎక్కువ భాగం హిందూ దేవీదేవతలకు చెందినవే. శ్రీకాకుళం పర్యటించినప్పుడు శ్రోతలు బొబ్బిలి యుద్ధం కథ కోరారు. నాజర్ తానే కథారచనకూ నడుం బిగించాడు. అంతేకాదు సామ్యవాద దృక్పథం గల వీరిని 1940వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ నెల జీతం మీద కథలు చెప్పించి పల్లెలలో పార్టీల ప్రచారానికి ఉపయోగించు కున్నది.

**బుర్రకథ విధానం**

వినరా భారత వీరకుమారా విజయం మనదేరా అన్న చరణం బుర్రకథల్లో సర్వ సామాన్యం. బుర్రకథ ముగ్గురు ప్రదర్శకులతో నిర్వహించబడుతుంది. - వీరిని కథ, రాజకీయం, హాస్యం అని పిలుస్తారు. మధ్యలో ఉండే కథకుడు పాడేదానికి చెప్పేదానికి ఇటూ అటూ ఉన్న ఇద్దరూ తందాన తానా అని వంత పాడతారు. ఇతనే ప్రధాన కథకుడు. ముఖ్య కథను, వర్ణనలనూ, నీతినీ, వ్యాఖ్యలనూ వచనంగా– అంటే మాటల్లో చెబుతూ, సందర్భం వచ్చినచోట భావపర మైన స్ఫూర్తిని కలిగించేందుకు రసవంతమైన పాటలు,పాడతాడు. కథకుడు ముఖ్య కళాకారుడు. ఇతనే ముఖ్య కథకుడు. ఇతను హాస్యంగా మాట్లాడడం అరుదుగా ఉంటుంది. ఒకవేళ ఎప్పుడైనా వేరే కబుర్లతో మిగిలిన ఇద్దరూ పక్కదారి పడుతున్నా.. ముఖ్య కథలోకి తీసుకొస్తూ నిబద్ధతతో కథ చెప్పడం ఇతని బాధ్యత. ఈ పాత్ర పోషించే వ్యక్తికి మాటా, ఆటా, పాటా బాగా తెలిసి ఉండాలి. ఇక కథ సంగతి సరేసరి. అతని (ఆమె) వేషధారణ కూడా రంగుల అంగరఖా, తలపాగా, నడుముగుడ్డ, ముత్యాల గొలుసు, కాలిగజ్జెలతో కనుల పండువుగా ఉంటుంది.

**బుర్రకథ కళాకారుడు అప్పారావుకు అవార్డు**

ప్రాచీన కాలము నాటి బుర్రకథ మరుగున పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కరుణించింది. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం పట్టణానికి చెందిన మిరియాల అప్పారావు అను బుర్రకథ కళాకారుడికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మ పురస్కారం అందజేసింది. ఈ అవార్డును కొనసాగించేందుకు మున్ముందు కూడా బుర్ర కథ కళాకారులను ఎంపిక చేయాలని, ఆ దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని ఆశిద్దాం.

# సాయినాధునికి ప్రత్యేక పూజలు



పులివెందుల అర్బన్ మేజర్ న్యూస్ పులివెందుల పట్టణంలోనిపార్నపల్లి రోడ్డు సమీపంలో కొలువై ఉన్న మొట్టమొదటి శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉదయాస్తమాన స్వామి వారికి ఆలయ అర్చకులు మురళి స్వామి పంచామృత అభిషేకం సహస్రనామార్చన ప్రత్యేక అలంకరణ మంగళహారతులు తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనాన్ని కలిగించారు. అనంతరం ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ఎంతో పురాతనమైన ప్రసిద్ధిగాంచిన పులివెందులలో మొట్ట మొదట కొలువై ఉన్న శ్రీ శిరిడి సాయి బాబా ఆలయంలో ప్రతి గురువారం భక్తుల సహాయ సహకారాలతో పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, స్వామి వారిపై ఎంతో నమ్మకముతో ఆలయానికి వచ్చి భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని పూజలు నిర్వహించడం జరుగుతోందని తెలియజేశారు. కార్యక్రమంలో సాయి సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.



# పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం

## భూమిరెడ్డి ఉమాదేవి


తొండూరు మేజర్ న్యూస్ముఖ్యమంత్రి సహాయనిధి కోసం పలు కారణాలవల్ల అప్లై చేసుకున్న వారి లబ్ధిదారు ఇంటి వద్దకే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను టిడిపి భూమి రెడ్డి ఉమాదేవి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమాల్లో భాగంగా గురువారం తొండూరు మండలం మడురు గ్రామంలో పల్లె భూదేవికి ముఖ్యమంత్రి సహాయనిధి రూ. 23,920.00 చెక్కును వారి స్వగృహానికి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి అందజేయడం జరిగింది వాటిలో భాగంగా తొండూరు మండలం, మల్లెల గ్రామానికి చెందిన మొపూరి నందినికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ. 43,460.00ల చెక్కును ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పట్నం సావిత్రికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 62,038 రూపాయల చెక్కును అందజేసిన శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి వారి స్వగృహానికి వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించడం జరిగింది. కార్యక్రమంలో గ్రామస్తులు లబ్ధిదారులు టిడిపి నాయకులు పాల్గొన్నారు

# వై.వీ.యూ.. ఎంబీఏ. విద్యార్థికి ప్రథమ బహుమతి

పెండ్లిమర్రి మేజర్ న్యూస్ యోగి వేమన విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కెరీర్ కన్సల్టెంట్ సంస్థ ఉద్యోగ ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సులో నిర్వహించిన క్విజ్ పోటీలలో ఎం.బీ.ఏ. విద్యార్థి అరవింద్ కుమార్ ప్రథమ బహుమతి సాధించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానాచార్యులు ఎస్. రఘునాథ్ రెడ్డి, ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ విజయ భారతి, సభ్యులు డా. గణేష్ నాయక్, విద్యార్థులు అరవింద్ కుమార్‌ను అభినందించారు.



# ఘనంగా పుట్టా మహేష్ యాదవ్ జన్మదిన వేడుకలు



ఖాజీపేట మేజర్ న్యూస్ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తనయుడు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను గురువారం ఖాజీపేట సాయిబాబా గుడి వద్ద ఘనంగా నిర్వహించారు. తెదేపా నేత, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సమీప బంధువు నెల్లూరప్ప యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో మండల టిడిపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని సాయిబాబా ఆలయంలో మహేశ్ కుమార్ యాదవ్ పేరు మీద ఆయన కుటుంబ సభ్యుల పేరు మీద ప్రత్యేక పూజలు చేయించారు. కేకును కట్ చేసి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ నిండు నూరేళ్లు హాయిగా ఉండాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా నెల్లూరప్ప యాదవ్ మాట్లాడుతూ పుట్టా కుటుంబం మైదుకూరు అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుందనీ, ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ యాదవ్ సైతం తన నియోజక వర్గ అభివృద్ధికి కంకణ బద్ధుడై ఉన్నాడని ఆయన నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల్లో మండల ఐటీడీపీ అధ్యక్షులు పాపన మల్లిఖార్జున రెడ్డి, బొర్రా శివరామి రెడ్డి, తెదేపా నాయకులు రమేష్‌నాయుడు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ నాగపట్నం రామసుబ్బయ్య, నరసయ్య పాల్గొన్నారు.

# మున్సిపల్ వైస్ ఛైర్మన్ బంగారు రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



ప్రొద్దుటూరు, మేజర్ న్యూస్: మునిసిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో, వైసీపీ కార్యాలయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలిని చెన్నమరాజుపల్లె వైయస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు పాతకోట బంగారు మునిరెడ్డి జన్మదినం సందర్భంగా వారిని గజమాలతో సత్కరించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. సోములవారిపల్లె పంచాయతీ ఒకటవ ఎంపీటీసి ఇంచార్జ్ గోటూరు వెంకటేష్ కార్యక్రమంలో అవార్డు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులు అభిమానులు పాల్గొని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు రెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యువ నాయకులు ప్రొద్దుటూరు ప్రచార కమిటీ అధ్యక్షులు దేసు రామ్మోహన్ రెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గం కోకన్వీనర్ చైతన్యకుమార్, రామాపురం వినోద్ శుభాకాంక్షలు తెలిపారు.

# కేజీబీవీ స్కూల్ అడ్మిషన్లకు నేడు చివరి రోజు

## ప్రిన్సిపాల్ రెడ్డి జ్యోతి



కలసపాడు మేజర్ న్యూస్ కలసపాడు మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతికి 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లకు ఇంటర్ ఫస్ట్ ఇయర్ సెకండ్ ఇయర్ తరగతులకు అప్లై చేసుకొనుటకు నేడు 11వ తేదీ చివరి రోజు అని కస్తూర్బా గాంధీ బాలి కల విద్యాలయం ప్రిన్సిపాల్ రెడ్డి జ్యోతి తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడు ఎనిమిది తరగతుల్లో మిగిలిన సీట్లకు కూడా అప్లై చేసుకోవచ్చు అని ఈ పాఠశాలలో మంచి వసతు లు ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉన్నాయని తెలియజేశారు

## వాయుబండ కాదు సామాన్యుడి నెత్తిన గుదిబండ-సిపిఎం



జమ్మలమడుగు మేజర్ న్యూస్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను ఉప సం హరించు కోవాలని సిపిఎం పార్టీ సెక్రటరీ జి.ఏసుదాసు స్థానిక ఎన్జిఓ కార్యాలయంలోని పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం వంట గ్యాస్ రేట్లను ఏకంగా ఒక్కో సిలిండర్ పై రూ.50 పెంచడం చాలా దారుణం అన్నారు. ఇప్పటికే అన్ని రకాల ధరలతో సతమతమవుతున్న పేదలపై మరింత ఆర్థిభారం మోపుతూ పెరిగిన రేటుతో గ్యాస్బండ రూ.925కి చేరి అనునిత్యం బ్రతుకుబండిని లాగే సామాన్యుడి జీవననానికి గుదిబండలా మారిందన్నారు. ఓ వైపు గ్యాస్ ధరలు పెంచుతూనే మరో వైపు గ్యాస్ సబ్సిడీకి మంగళం పాడే ప్రయత్నం చేస్తున్నది.2014కంటే ముందు గ్యాస్ సబ్సిడీ విధానం లేదు.బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్యాస్పై అధికంగా వసూలు చేస్తూ అందులోంచి సబ్సిడీ పేరుతో తిరిగి ఇచ్చే విధానానికి శ్రీకారం చుట్టింది. సిలిండర్ ధర పెంపుతో మళ్లీ కట్టెల పొయ్యి పెట్టాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు.చిరు వ్యాపారుల పరిస్థితి అయితే మరీ దారుణంగా అమ్మ బోతే అడివి కొనబోతే కొరివి అన్నట్లు ఉన్నది,వచ్చేది కొంత పోయేది చేంతాడంత. హెూటళ్లు,ఇడ్లి బండ్లు, స్ట్రీట్ వెండర్లు తదితర చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడనున్నది.కేంద్రం తక్షణమే గ్యాస్ పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలి అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు వినయ్ కుమార్,మధు పాల్గొన్నారు.



## చిత్తశుద్ధి లేని కూటమి ప్రభుత్వం : సిపిఐ

జమ్మలమడుగు మేజర్ న్యూస్: తాసిల్దార్ కార్యాలయం లో ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవాడి ఇళ్ల గురించి గొప్పగా చెప్పే పాలకులు చేతల్లో విఫలమవుతున్నారని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇళ్ల సమస్యలను నిర్దిష్ట కాలపరిమితితో పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం,ఇళ్లు మంజూరు చేయాలన్నారు. సచివాలయం పరిధిలో, తాసిల్దార్ కార్యాలయాల్లో,అధికారులు పేద ప్రజల నుంచి ఇళ్ల స్థలాలు అర్జీలు స్వీకరించే కార్యక్రమం చేపట్టాలన్నారు.పట్టణాలలో 2సెంట్లు, గ్రామీణ ప్రాంతాల 3సెంట్లు అర్హులైన వారందరికీ ఇవ్వడానికి ఇప్పటి నుండే స్థల సేకరణ చేపట్టాలన్నారు. గత ప్రభుత్వ లేఅవుట్ కాలనీలల్లో సెంటు స్థలాల్లో ఇళ్లులు నిర్మించుకున్న వారి సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయని,వాటి పట్ల కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. పేదోళ్ల ఇళ్ల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి ప్రకాశం ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్నయ్య నరసింహులు సిపిఐ నాయకులు ప్రసాదు, లక్ష్మీనారాయణ,మధు, వెంకటరమణ, శ్రీనివాసుల, సంతోష్, మునిస్వామి పాల్గొన్నారు.

## పులివెందుల డిపోలో నిరసన గెట్ మీటింగ్ కార్యక్రమం



పులివెందుల మేజర్ న్యూస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మొదటి రోజు పులివెందుల డిపోలో చేపట్టిన నిరసన, గేట్ మీటింగ్ కార్యక్రమం నిర్వహిస్తూ న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాడుదాం అంటూ ఏపీ టిటిడి నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో పులివెందుల లోని ఆర్టీసీ ఉద్యోగులు డిపో వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారి న్యాయమైన కోరికలు పత్రికాముఖంగా తెలియజేస్తూ 10.04.2025 మరియు ,11.04.25 రెండు రోజులు గేట్ మీటింగ్ నందు స్లొగన్స్ నిర్వహిస్తామని జిందాబాద్ ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఎండికి ఇచ్చిన మెమొరాం డం లోని సమస్యలను వెంటనే. పరిష్కరించాలని తమ డిమాండ్ తెలియజేస్తూ ఉద్యోగుల ఉద్యోగ.భద్రతా సర్క్యులర్ 1/2019 ను వెంటనే అమలు చేయాలని,అక్రమ సస్పెన్షన్లు అక్రమ రిమూవల్స్ను వెంటనేఆపాలని, నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని,ఈ హెచ్ ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారామాత్రమే కొనాలి,114 జీవో లో పొందిన పరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్సును 150 నుంచి 400 వరకు చెల్లింపులు చేయాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థపరంగా వేతనాలు చెల్లించాలని, ఏపీఎస్ఆర్టీసీ లో ఉన్న విధంగానే క్యాడర్ స్ట్రెంత్ అమలు చేయాలని,తీవ్రమైన అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలని, డిప్టేషన్లను యధావిధిగా కొనసాగించాలని, ఉద్యోగుల అవసరాన్ని బట్టి ఈఓఎల్ లు మంజూరు చేయాలని, పార దర్శకమైన ట్రాన్స్ఫర్ పాలసీని అమలు చేయాలని, ఆఫీసు సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని, రిటైర్ ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణాలను అనుమతించాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ఆన్ కాల్ డ్రైవర్ల డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని, పోరాడుతాం పోరాడుతాం మా న్యాయమైన సమస్యల పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని ఆర్టీసీ ఉద్యోగస్తులు తమ డిమాండ్లను తెలిపారు ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్టీసీ ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఏ.పి. పి.జి. సెట్-2025 ఆన్లైన్ దరఖాస్తుల ప్రారంభం




పెండ్లిమర్రి మేజర్ న్యూస్ యోగివేమన విశ్వవిద్యాలయం లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాస రావు వెల్లడించారు. ఈ సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యా లయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ రఘునాథ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. పద్మ , పౌరసంబంధాల విభాగం సంచాలకులు, డాక్టర్ పి. సరితతో కలిసి ఈ రోజు ఉదయం ప్రెస్ మీట్ నిర్వహించారు. మార్చి 31వ తేదీన ఏ.పి.పి.జి.సెట్ 2025 నోటిఫికేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మార్గదర్శకత్వంలో ఏపిపిజిసెట్ - 2025 నోటిఫికేషన్ కూడా విడుదలైందన్నారు. ఏప్రిల్ 2వ తేదీన ఆన్లైన్ దరఖాస్తులు ఆరంభమ య్యాయి అని తెలిపారు. ఈ సందర్భంగా వై.వి.యు. వీ.సీ. తన కార్యాలయం లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విశ్వవిద్యాల యంలో సైన్స్, ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ , కామర్స్ శాఖలకు సంబంధించి 29 కోర్సులు వై.వీ.యూ.లో ఉన్నాయన్నారు. ఇందులో ప్రవేశాలకు డిగ్రీ కోర్స్ పూర్తయిన విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఆన్లైన్ దరఖాస్తులను విద్యార్థులు అపరాధ రుసుం లేకుండా ఈనెల రెండవ తేదీ నుంచి మే నెల 5వ తేదీ వరకు సమర్పించవచ్చన్నారు. ఓసి విద్యార్థులకు రూ. 850, బిసిలకు రూ. 750, ఎస్సీ, ఎస్టీలకు రూ. 650 వరకు రుసుము చెల్లించాలన్నారు. వివిధ రకాల అపరాధ రుసుముతో 25/5/2025 వరకు అప్లై చేసుకునే అవకాశం వుందన్నారు. ఈ ఎంట్రన్స్ పరీక్ష 153 కోర్సుల్లో చేరడానికి 31 పరీక్షలను 9/6/2025 నుండి 13/6/2025 వరకు మూడు సెషన్స్ లలో నిర్వహిస్తారని ,13 పాత జిల్లా కేంద్రాలను ఆధారంగా దాదాపు 35 పరీక్ష కేంద్రాలలో పరీక్ష జరుగుతుందని వారు వివరించారు. రాష్ట్రంలోని 17విశ్వవిద్యాలయాల్లో ఆర్ట్స్, కామర్స్, ఎడ్యుకేషన్, సైన్సెస్లలో 30,534 సీట్లకు పిజిసెట్-2025 నిర్వహిస్తున్నారని తెలిపారు. వైవియులోని 29 శాఖలలో విద్యార్థుల ప్రవేశాలు పెరిగే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఉన్నామని తెలిపారు. ఈదరఖాస్తుల కోసం https://cets.apsche.ap.gov.inవెబ్సైట్ ను సందర్శించాలని సూచించారు. విశ్వవిద్యాలయ సమాచారం కోసం www.yvu.edu.in ను సందర్శించాలని కోరారు.

## కొండాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్పై చర్యలకు జాప్యమేల?

### కేసు నమోదు కాబడిన వ్యక్తుల పైన జిల్లా అధికారులకు ప్రేమయేలా? : డివైఎఫ్ఐ

### జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్




జమ్మలమడుగు మేజర్ న్యూస్: కొండాపురం మండలం లోని పునరావాస కలని చోటుపల్లె గ్రామంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ని ఆరోపణలు,కేసులు నమోదు కాబడిన వ్యక్తి అయినా ప్రిన్సిపాల్ ను కొనసాగింపు చేయడం ఆమె పై వచ్చిన ఆరోపణల్లో తీసుకునే చర్యలలో జాప్యం జిల్లా అధికారులు ఎందుకు చేస్తున్నారని జిల్లా కార్యదర్శి వీరణాల.శివకుమార్ తెలిపారు. జమ్మలమడుగు లో స్థానిక ఎన్జీవో కార్యాలయం నందు విలేఖరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గత ఏడాదికాలంలో కొండాపురంలోని గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ భర్త అక్కడి సిబ్బంది పై లైంగిక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో నిజనిర్ధారణలో వాస్తవమని తెలిసి ప్రిన్సిపాల్,ఆమె భర్త పై పోలీసులు కేసు నమోదు చేశారని అన్నారు.అది పత్రికలలో కూడా వచ్చిందని తెలియజేశారు.అయిన ఒక ప్రిన్సిపాల్ పైన కేసు నమోదు కాబడిన వ్యక్తి నీ ఇంకా ఆ గురుకుల పాఠశాలలో కొనసాగించడం దేనికి నిదర్శనం అని ప్రశ్నించారు.బయట ప్రజలలో అనేక అనుమానాలకు కూడా తావిస్తున్నాయని అన్నారు.ఇప్పటికీ ప్రిన్సిపాల్ భర్త గురుకుల పాఠశాలలో క్వార్టర్స్ లో విద్యార్థినుల కలిగిన హాస్టల్ లో కొనసాగించడం దారుణం అన్నారు.గతంలో ఆ గురుకుల పాఠశాలలో పాముకాటు సంఘటనలు కూడా జరిగాయని అన్నారు.వరుస ఆరోపణలు,సంఘటనలు జరుగుతున్న జిల్లా అధికారులు ఆమె పై చర్యలు తీసుకోవడంలో అలసత్వం ఎందుకు వహిస్తున్నారని కనీసం ఆ పాఠశాల నుండి కూడా తప్పించకుండ కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులు కొండాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకొని పాఠశాల నుంచి తక్షణమే తప్పించాలని లేకుంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, నాయకులు శంకర్ పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### కడప జిల్లా టీడీపీ కార్యదర్శి సింగారెడ్డి జయరామి రెడ్డి



వేంపల్లె, మేజర్ న్యూస్: రైతు బాగుంటే ఊరు బాగుంటుందని, రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా టీడీపీ కార్యదర్శి సింగారెడ్డి జయ రామి రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముచ్చుకోన ప్రాంతంలో సాగు నీటి ఎద్దడి ఏర్పడింది. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లలో నీరు ఇంకిపోయి రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తోలుకుంటున్నారు. జయరామిరెడ్డి ఈ విషయాన్ని తుంగభద్ర ప్రాజెక్టు హై లెవల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రెండు రోజుల కిందట ముచ్చుకోన ప్రాంతాన్ని పరిశీలించారు. ముచ్చుకోన పంప్హౌస్ లో మోటార్లు ఆరు సంవత్సరాలుగా పనిచేయడం లేదని అధికారులు తెలిపారు. మోటర్లు తొందరగా బాగు చేయించాలని అధికారులకు, జిల్లా కార్యదర్శి జయరామి రెడ్డికి సూచించారు. గురువారం మెకానికల్ డిపార్టుమెంటుకు సంబంధించిన వారితో ముచ్చుకోన పంప్ హౌస్ను పరిశీలించారు. దాదాపు రూ.5 లక్షల ఖర్చు అవుతుందని మెకానిక్లు తెలుపగా స్పందించిన జయరామిరెడ్డి తన సొంత నిధులు వెచ్చిస్తానని చెప్పారు. ఈ విషయమై ఆయన ఈఈ రాజ శేఖర్తో ఫోన్లో మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు సింగారెడ్డి శివకృష్ణా రెడ్డి, ఆదిత్యా రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## డాక్టర్ పెనుగొండ రవికుమార్‌కు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డు




జమ్మలమడుగు మేజర్ న్యూస్: జమ్మల మడుగు పట్టణానికి చెందిన ట్రిపుల్ఐటీ పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్‌కు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు సౌత్ రన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి నాగయ్య తెలిపారు. 12సంవత్సరాలనుండి ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అంకితభావముతో క్రియాశీలకంగా పనిచేస్తూ ట్రిపుల్ఐటీ అభివృద్ధికి పాటు పడుతూ అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన జపాన్‌లోని ఏఐజెడ్‌యు యూనివర్సిటీలో పరిశోధనలు చేసి, సాహిత్యం, విద్య, సామాజిక సేవా రంగంలో విశేషమైన కృషి చేసినందుకు గాను ఆయన విలువైన సేవలను గౌరవిస్తూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ అవార్డుకు డాక్టర్ పెనుగొండ రవికుమార్‌ను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 13న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ పురస్కారంను ప్రధానంచేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సంద్ర,వైస్ ఛాన్సలర్ విజయ్ కుమార్ అభినందనలు తెలియజేసారు.

## గర్భిణులకు వైద్య పరీక్షలు..!

బద్వేల్ మేజర్ న్యూస్ బద్వేల్ మండలం తొటిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నందు ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభయాన్ కార్యక్రమం సందర్భంగా గురువారం గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సంజీవిని హాస్పిటల్ బద్వేల్ డాక్టర్ శివ లలిత స్త్రీ వ్యాధి నిపుణులు ఆధ్వర్యంలో 29 మంది గర్భిణీ స్త్రీలకు వైద్య సేవలు అందించడమైనది. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివ లలిత మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పోషకాహార లోపం రక్తహీనత లేకుండా గర్భిణీ సమయంలో తీసుకొనవలసిన జాగ్రత్తలు సురక్షిత కాన్పులను గురించి గర్భిణీలకు అవగాహన కల్పించడమైనది. ఈ కార్యక్రమంలో కష్టతరమైన వారిని గుర్తించి ప్రత్యేక స్కానింగ్ కొరకు పై ఆసుపత్రులకు వైద్య పరీక్షల కొరకు రఫర్ చేయడమైనది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జె.వినయ్ కుమార్ బి.వెంగయ్య హెల్త్ ఎడ్యుకేటర్ కె. చంద్రావతి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. వెంకటమ్మ హెల్త్ సూపర్వైజర్ పాల్గొని గర్భిణీ స్త్రీలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్య పరీక్షలు అంగన్వాడి కేంద్రాల్లో అందించే పోషక పదార్థాలు తీసుకొనవలసిన జాగ్రత్తలు గవర్నమెంట్ హాస్పిటల్ నందు కాన్పులు జరుగుతే జననీ సురక్ష యోజన, శిశు జనని సురక్ష పథకాల 108, 102 వాహనం ద్వారా అందజేయు సేవలను గురించి వివరించడమైనది. కార్యక్రమానంతరము గర్భిణీ స్త్రీలందరికి వీరపల్ల



ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం వారు ఏ. ఎన్. యం,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆశా కార్యకర్తలు అల్పాహారము ఏర్పాటు చేసి, ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బిమల్లేష్ ద్వారా అందిం చారు. కార్యక్రమము ప్రతినెల 9,10వ తారీఖున జరుగు తుందనీ, గర్భిణీలు 102, 108 సేవలు ఉపయోగించుకోవాలని పేర్కొనడమైనది. పూర్వస్థ పిండ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరము కావున బాలికల ను రక్షిద్దాం బాలికలను చదివిద్దాం అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకొని పోయి బాలికల నిష్పత్తి పెంచవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని బి.వెంగయ్య హెల్త్ ఎడ్యుక్టర్ పేర్కొనడమైనది. కార్య క్రమం లో డాక్టర్ జై వినయ్ కుమార్ మెడికల్ ఆఫీసర్, బి వెంగయ్య హెల్త్ ఎడ్యుకేటర్, జై చంద్రావతి కమిటీ హెల్త్ఆఫీసర్, హెల్త్ సూపర్వై జర్ వెంకటమ్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఏఎన్ఎం ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.




## గ్రామీణ ప్రజల ఆరోగ్యం పై అలసత్వం వద్దు

### భాజాపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్

వేంపల్లె, మేజర్ న్యూస్: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం పై వైద్యశాఖ అధికారులు అలసత్వం చూపకుండా వైద్య సేవలు అందించాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరి ప్రసాద్ అన్నారు. ఈ మేరకు భాజపా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న గావ్ చలో అభియాన్ (పల్లెకు పోదాం) లో భాగంగా పాములూరు గ్రామంలో వున్న విలేజ్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించి అనంతరం అక్కడి ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ సబ్ కాసాత్‌సబ్‌కావికాస్ (అందరి అభివృద్ధి కోసం అందరిని కలుపుకొని) దేశ సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు లబ్ది పొందాలని అన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన ద్వారా ఇల్లు, కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు ప్రతి ఏడాది పెట్టుబడి సాయం కింద రూ.6వేలు, ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన బ్యాంకింగ్ సేవలకు ప్రాప్యత కల్పించడం ద్వారా ఆర్థిక చేరికను పెంచడం, మేక్ ఇన్ ఇండియా ద్వారా దేశీయ తయారీ పెట్టుబడులను ప్రోత్సహించడం, ఆయుష్మాన్ భారత్ ద్వారా బలహీన వర్గాల ప్రజలకు ఆరోగ్య భీమా కవరేజ్ చేయడం కార్యక్రమాలతో దేశాన్ని ముందుకు నడిపి స్తున్న ధీరుడు మోడీ అని అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మునగల చంద్ర, దేవిరెడ్డి శసేంద్ర కుమార్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిమాన్వితమైన కమలాపురం పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలు

### 12న గంధం మహోత్సవం ... 13న ఉరుసు కార్యక్రమం



కమలాపురం, మేజర్ న్యూస్: ఈ ప్రాంతంలోని కమలా పురం పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలును ప్రజలు ప్రత్యేకంగా చెప్పుకుంటారు కులమతాల క తీతంగా తమ భక్తిని చాటుకుంటారు రాష్ట్ర నల మూలం నుంచి కాకుండా మహారాష్ట్ర కర్ణాటక తమిళనాడు కేరళ తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఉరుసు ఉత్సవంలో పాల్గొంటారు ఇప్పటికే కమలాపురం పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు ఇక్కడ కొలువై ఉన్న మహిమాన్వితమైన హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి కర్ణాటక రాష్ట్రం బెల్గాం నుంచి మత ప్రబోధనలు చేస్తూ 1916 లో కమలా పురానికి వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు తన భక్తులకు బోధన చేస్తూ మహిమలు చూపారని ప్రతీక. గఫర్ షా ఖాద్రి తన ప్రియ శిష్యుడైన దస్తగిరిషా ఖాద్రికి గురుత్వం బోధించి 1924 జనవరి 10న సమాధి అయ్యారు అప్పటి నుంచి ఇప్పటివరకు దస్తగిరి షాఖాద్రి వంశీయులే పీఠాధిపతులుగా కొనసాగుతున్నారు హజరత్ దస్తగిరి షా ఖాద్రికి ముఖ్య శిష్యుడుగా ఉన్న నామానాగయ్య శ్రేష్టి కుటుంబ సభ్యులు ఇప్పటికీ ధర్మకర్తలు



గాకొనసాగుతున్నారు శుక్రవారం నషాన్‌తో ఉరుసు మహోత్సవాలు ప్రారంభం అవుతాయి 12న శనివారం గంధం 13న ఆదివారం ఉరుసు ఉత్సవం నిర్వహిస్తారు దర్గా ప్రాంగ ణంలో పాల దంతాలు కలిగిన వృషభరాజ్యములచే బండలాగుడు పోటీలను నిర్వహిస్తారు ప్రథమ బహుమతిరూ 50 వేలు ద్వితీయరూ 30 వేలు తృతీయ రూ 20, వేలు నాలుగవ బహుమతి రూ10 వేలు అంద జేస్తారు గంధం ఉరుసు మహోత్సవాల్లో రెండు రోజులపాటు గొప్ప ఖవ్వాలి పోటీని నిర్వహిస్తున్నారు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఢిల్లీకి చెందినఖుత్ బీ బ్రదర్స్ యూపీ కి చెందిన సర్వరాజు అన్వర్ సాబిరి ల మధ్య గొప్ప ఖవ్వాలి పోటీ జరుగుతుందన్నారు ఈ మూడు రోజులపాటు ఇక్కడికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు 14న సోమవారం తహలీల్ తో ఉరుసు ఉత్సవాలు ముగిస్తాయి పెద్ద ఎత్తున ప్రజలు ఈ ఉరుసుఉత్సవంలో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు

## ఏవిఆర్,లిటిల్ ఫ్లవర్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

### డివైఎఫ్ఐ పట్టణ కమిటీ



బద్వేల్ మేజర్ న్యూస్. బద్వేల్ పట్టణంలో ఉన్న ఏ వి ఆర్, లిటిల్ ఫ్లవర్ స్కూల్స్ గజగజ రోజుల కిందట చిన్నారులపై లైంగిక దాడులకి పాల్పడిన ఉపాధ్యాయులపై ఫోక్సో చట్టం కేసులు నమోదు చేయాలని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారి రఘునాథ్ గారికి భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. చిన్ని మాట్లాడుతూ... ఈ మధ్యకాలంలో ఏవిఆర్ స్కూల్ మరియు లిటిల్ ఫ్లవర్ స్కూల్స్‌లలో విద్యార్థినిలపైన అసభ్యకరంగా, లైంగికంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకొని వారిపైన ఫోక్సో యాక్ట్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల పైన అలా ప్రవర్తించిన వారిపైన సెక్షన్లు తగ్గించి మామూలు కేసులు పెట్టడం సరైంది కాదని ప్రవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలకు రక్షణ కల్పించాల్సినటువంటి యాజమాన్యం తప్పుడు అలవాట్లకు గురైనటువంటి ఉపాధ్యాయులకు మద్దతు పలకడం దుర్మార్గమన్నారు. పాఠశాలలకు పిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి జిల్లా విద్యాశాఖ అధికారి కలెక్టర్ ప్రవేట్ పాఠశాలలపై నిఘా ఏర్పాటు చేసి విద్యార్థులకు రక్షణ కల్పించాలన్నారు. తప్పుడు ప్రవర్తనతో చూస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయులను వారు చేర్చుకునేటప్పుడు వారు క్వాలిఫికేషన్‌తో పాటు వారి ప్రవర్తన కూడా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వారిపైన ఫోక్స్ యాక్ట్ అమలు చేసి ఇంకొకరు ఎవరైనా విద్యార్థినిల జోలికి పోవాలంటే భయం కలిగేటట్టు చేయాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందన్నారు. ఇలాంటి కామాంధులు అయిన ఉపాధ్యాయులు అన్వర్, పెంచలయ్యలను కఠినంగా శిక్షించాలని వారికి సపోర్ట్ చేస్తున్న ఆ యాజమాన్యాలపై చర్యలు తీసుకొని గుర్తింపు రద్దు చేయాలని అలా చేస్తే మిగతా ప్రైవేట్ స్కూల్ యాజమాన్యానికి భయం కలుగుతుందన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే ఏవిఆర్, లిటిల్ ఫ్లవర్ స్కూల్స్ గుర్తింపును రద్దు చేయాలని లేని పక్షంలో ఆ పాఠశాలల ఎదుట డివైఎఫ్ఐ యువజన సంఘం మిగతా సంఘాలు కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్, షరీఫ్, ఎస్.కె ఆదిల్, ఉపాధ్యక్షులు యువరాజ్, సుధాకర్, నాగేంద్ర పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం

### డాక్టర్ సురేష్ బాబు డాక్టర్ వికసిత



మేజర్ న్యూస్ దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరు ప్రాదమిక అరోగ్య కేంద్రం నందు గురువారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం" దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ సురేష్ బాబు మెడికల్ ఆఫీసర్ మరియు డాక్టర్ పి.వికసిత మెడికల్ ఆఫీసర్ మరియు ప్రొద్దు టూరు ప్రయివేట్ ఆసుపత్రి నుండి వచ్చిన డాక్టర్ ఏ.తేజ ఆధ్వర్యంలో దువ్వూరు మండలం పరిధిలోని అన్ని సచివా లయం పరిధిలోని గ్రామాల నుండి 38మంది గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో 25 మంది హైరిస్క్ గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ చేయడమైనది అందరికి ఆరోగ్య పరీక్షలు, సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది, మరియు వారిని ఎత్తు, బరువు, హెచ్‌బి గ్రూపింగ్, రక్త పరీక్షలు, యూరిన్, ఆల్బుమిన్, షుగర్ పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమములో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ విజయకుమారి, ఆరోగ్య విస్తరణ అధికారి రాజగోపాల్ సూపెర్వైసర్స్ శాంతకుమారి, సువర్ణ, శివ గంగరాజు, వీర ఆంజినేయులు, హాస్పటల్ సిబ్బంది, ఏఎన్ఎం లు, సిహెచ్ ఓలు, ఆశా కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్ బయన్న పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో ఉన్న గ్రామాల అభివృద్ధి నా ధ్యేయం

## టిడిపి ఇంచార్జ్ భూపేష్ రెడ్డి





జమ్మలమడుగు మేజర్ న్యూస్: జమ్మలమడుగు మండల పరిధిలోని నర్సోజు కొట్టాల గ్రామంలో పర్యటించిన భూపేష్ రెడ్డి. ముందుగా కట్ట కింద మారమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరం మైలవరం ప్రాజెక్టు నుండి దక్షిణ కాలువ ద్వారా పోన్నతోట,నర్సోజి కొట్టాల గ్రామపొలాలకు పోయే నీరు లీకేజ్ ద్వారా వృధా అవుతుందని కొన్ని సంవత్సరాలుగా ఈ సమస్య పరిష్కారం కాలేదని రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని గ్రామ ప్రజలు జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ భూపేష్ సుబ్బరామిరెడ్డి దృష్టికి తేవడంతో గురువారం ఉదయమే ఇరిగేషన్ అధికారులతో కలిసి లీకేజ్ అవుతున్న కాలువను పరిశీలించారు. ఈ లీకేజ్ అరికట్టడం ద్వారా సుమారు 330 ఎకరాలకు సాగునీరు అందుతుంది గ్రామస్తులు వారి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే అధికారులకు లీగేజ్ అవుతున్న కాలువ సమస్య చూపించి త్వరగా పూర్తి చేసి సమస్య లేకుండా చూడాలని అధికారులకు తెలిపారు. అనంతరం భూపేష్ రెడ్డి అధికారుల సమక్షంలోనే మాట్లాడుతూ నియోజవర్గంలో ఉన్న గ్రామాల అభివృద్ధి నా ధ్యేయమని తెలిపారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకురావాలని తెలిపారు త్రాగునీటి సమస్య ఉన్న రోడ్ల సమస్య ఉన్న కరెంటు సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే నర్సోజి కొట్టాల గ్రామానికి సంబంధించిన కాలువ లీకేజీ పనులు త్వరలోనే ప్రారంభించి పూర్తి చేసే బాధ్యత నాదేనని తెలిపారు. ఈ కాలువ నీటి ద్వారా రైతులు రెండుసార్లు పంటలు వేసుకోవాలని ఆనందంగా ఉండాలని తెలిపారు. అనంతరం అక్కడనుండి పంచాయతీ పరిధిలో ఉన్న ఆర్అండ్ఆర్ కాలనీలో వేమకుంట పల్లి గ్రామానికి సంబంధించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. పాఠశాల లో ఉన్న సమస్యలను మండల ఎంఈఓ ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని మరి ముఖ్యంగా ఎండలు ఎక్కువ ఉన్నవి విద్యార్థులకు త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో డిఈ కృష్ణమూర్తి, నరసింహమూర్తి, ఏఈ సుబ్బారావు, వెంకటేశ్వర రెడ్డి, ఎంఈఓ చంద్రశేఖర్ రెడ్డి,రమణారెడ్డి ప్రధాన ఉపాధ్యాయులు స్కూల్ కమిటీ సభ్యులు గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై గ్యారేజ్ వద్ద ధర్నా



ప్రొద్దుటూరు, మేజర్ న్యూస్: ఏ.పి.పి.టి.డి(ఆర్టీసీ) ఉద్యోగుల సమస్యల కొరకు గురువారం ఎన్.ఎం.యు.ఏ నాయకులు ఉద్యోగులు ఆర్టిసి గ్యారేజీ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిటీ నాయకులు వై ఆర్ కె రెడ్డి, నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండు రోజులు ఈ ధర్నా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల ఉద్యోగ భద్రత 1/2019 సర్కులర్ ను అమలు చెయ్యాలన్నారు.అక్రమ సస్పెన్షన్లను, అక్రమ రిమూవల్స్, ఆపాలన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని తెలిపారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలన్నారు. నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలన్నారు. ఈ.హెచ్.ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని అమరు పరచాలని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారాకొనాలన్నారు. 114 జీవోలో పొందుపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్సును 150 నుంచి 400 వరకు చెల్లింపు చేయాలన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సమస్తపరంగా వేతనాలు చెల్లించాలన్నారు. ఏపీఎస్ఆర్టీసీలో ఉన్న విధానాన్నే క్యాడర్ స్ట్రెంత్ అమలు చేయాలన్నారు. తీవ్రమైన అనారోగ్య కారణం కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలని తెలిపారు. ఉద్యోగుల అవసరాన్ని బట్టి ఈ.ఓ.ఎల్ మంజూరు చెయ్యాలని తెలిపారు. పారదర్శకమైన ట్రాన్స్ఫర్స్ పాలసీని అమలు చేయాలన్నారు. ఆఫీస్ సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణాలను అనుమతించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ భాను ప్రసాద్, గ్యారేజ్ సెక్రెటరీ అశోక్ కుమార్,జోనల్ నాయకులు,డిపో నాయకులు,ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.


# ప్రతి శాఖ విజన్ మిషన్ కలిగి ఉండాలి

## వైవియు వి.సి. ఆచార్య అల్లం శ్రీనివాసరావు



పెండ్లిమర్రి, మేజర్ న్యూస్ భవిష్యత్తులో మనం ఉన్నతంగా ఉండేందుకు నిర్ణయించుకున్న దీర్ఘకాలిక లక్ష్యాలు (విజన్), ఆ లక్ష్యాల సాధనకు మనము అనుసరించే విధానాలను (మిషన్) ప్రతి శాఖ రూపొందించుకొని వాటిని సాధించే క్రతువులో నిమగ్నం అవ్వాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మజి యోగి వేమన విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు శాఖల వారీగా సమీక్షను గురువారం రెండో రోజు కొనసాగించారు. ఎకనామిక్స్, ఇంగ్లీష్, తెలుగు, బయో కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, జెనెటిక్స్ అండ్ జినోమిక్స్ డిపార్ట్మెంట్లను సందర్శించారు. ఆయా శాఖల విభాగాధిపతులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారి వారి విభాగాల అభివృద్ధి గురించి ఉపకులపతి ముందు వివరించారు. వైస్ ఛాన్సిలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు సూచనచేస్తూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు విశ్వవిద్యాలయంలో ఎక్కువ శాతం చదువుతున్నారని వారికి కమ్యూనికేషన్స్ స్కిల్స్, ఆంగ్ల భాషలో ప్రావీణ్యత ఉండేలా నిర్ణ యాలు తీసుకోవాలన్నారు. ఆంగ్ల శాఖలో లాంగ్వేజ్ ల్యాబ్ విశ్వవిద్యా లయంలోని అందరి విద్యార్థులకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. గేట్ వంటి పరీక్షకు శిక్షణ ఇచ్చే ప్రయత్నం జరగాలన్నారు. తెలుగు శాఖలో సాహిత్య వేదికను(లిటరరీ క్లబ్) ఏర్పాటు చేసుకోవాలని స్కాలర్లకు సూచించారు. తెలుగు విద్యార్థులైన ఆంగ్లాన్ని కూడా నేర్చుకోవాలన్నారు. రీసెర్చ్ మెథడాలజీ టెక్నిక్స్ ఆఫ్ రైటింగ్ స్కిల్స్ విద్యార్థులకు అలవడేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆర్ సెట్ ద్వారా పీహెచ్డీ ప్రవేశాల పొందిన విద్యార్థులకు కొంతైనా స్కాలర్షిప్ ఇచ్చే విషయమై పరిశీలిస్తామన్నారు. విద్యార్థుల అభిప్రాయాలను తీసుకుని వారికి విలువైన సూచనలు చేశారు. సైన్స్ విభాగాలలో ప్రయోగశాలలు, పరిశోధన ల్యాబ్లు, మౌలిక సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఉపకులపతి వెంట ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ రెడ్డి , రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి పద్మ ఉన్నారు.

# నేడు అయ్యప్పస్వామి జన్మదినోత్సవ వేడుకలు



పులివెందుల మేజర్ న్యూస్ పట్టణంలోని కోతి సమాధి సమీపంలో ఉన్న శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్పస్వామి జన్మదినోత్సవ వేడుకలు నిర్వహిం చనున్నట్లు అయ్యప్పస్వామి దేవస్థాన నిర్వాహకుడు, గురుస్వామి వెంకట్రామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన తెలుపుతూ శుక్రవారం తెల్లవారుజామున అయిదు గంటల నుండి పంచామృ తాభిషేకంతో పాటు తోమాల అలంకరణ, విశేష పూజలు ఉంటాయన్నారు. గంటల నుండి హెూమాలు నిర్వహించి సాయంత్రం ఆరు గంటలకు భజన కార్యక్రమం నిర్వహించి భక్తులకు అల్పాహారం అందించడం జరుగుతుందన్నారు. భక్తులు అయ్యప్పస్వామి దినోత్సవానికి ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం. చేయాలన్నారు.

# 12,13 తేదీలలో శ్రీశ్రీశ్రీ నెమలిదిన్నె హుస్సేన్ వల్లి స్వామి ఉరుసు

## బండలాగుడు పోటీలు




దువ్వూరు మేజర్ న్యూస్ మండల పరిధిలోని చింతకుంట గ్రామ పంచాయతీలోని కడప- కర్నూలు జాతీయ రహదారిలో మిర్జాఖాన్ పల్లె వెలసిన శ్రీ శ్రీ శ్రీ నెమళ్ల దీన్నేహుస్సేన్ స్వామి ఉరుసు 12,13 తేదీలలో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ 12వ తేదీశనివారం గంధమురోజు సంగటి తిమ్మాయపల్లె నుంచి గంధము ఊరేగింపుగా తీసుకురావడం జరుగు తుందన్నారు, 13వ తేదీఆదివారం రాత్రి మిర్జాఖాన్ పల్లె గ్రామనికి చెందిన వారు జెండాను ఊరేగింపుగా స్వామివారి సన్నిధికి తీసుకు రావడం జరుగుతుంది అని అన్నారు. హుస్సేన్ వల్లి స్వామిని పూజించిన వారి కోర్కెలు నేరవేరును అని ఇప్పటికి కూడా భావిస్తున్నారు. 13వ తేదీ ఆదివారం మధ్యాహ్నం నుంచి ఒంగోలు జాతి వృషభ రాజులకు బండలా గుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి 50116లు రెండో బహుమతి రూ.40116లు మూడవ బహుమతి రూ.30116లు నాలుగో బహుమతి రూ.20116 లు ఐదవ బహుమతి రూ.10116లు, ఆరో బహుమతి రూ.6116లు, ఏడవ బహుమతి రూ.5116లు కేటాయించి నట్లు కమిటీ సబ్యులు తెలిపారు. శనివారం, ఆదివారం రెండు రోజులు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుకమిటీ సభ్యులు తెలిపారు. కావున మండలం లోని భక్తులందరూ పాల్గొని ఉరుసును విజయవంతం చేయాలని తెలిపారు

# వాహనాల దారి మళ్లింపు

కడప - మేజర్ న్యూస్ కడప నుండి తిరుపతి వైపు వెళ్లే వాహనాలు కడప నగరం అలంఖాన్ పల్లి ఇర్కాన్ జంక్షన్ నుండి ఊటుకూరు సర్కిల్, రాయచోటి మీదుగా తిరుపతి వెళ్ళాలి. తిరుపతి నుండి కడప వైపు వచ్చే భారీ వాహనాలు, రవాణా వాహనాలు రాయచోటి మీదుగా కడపకు చేరుకోవాలి. రాజంపేట వైపు నుండి కడప వెళ్లే భారీ వాహనాలను రాయచోటి మీదుగా దారి మళ్లింపు. రాజంపేట వైపు నుండి వచ్చే ద్విచక్ర వాహనాలు సాలాబాద్ నుండి ఇబ్రహీం పేట, మాధవరం మీదుగా పంపబడును.

# పగలే వెన్నెలాయే .. కరెంట్ బిల్లు మోపెడాయే

## ఒకే కరెంటుస్తంభానికి రెండు లైట్లు



పులివెందుల మేజర్ న్యూస్ మున్సిపాలిటీ పరిధిలో ఒక్క కరెంటు స్తంభానికి పాలపల్లి రోడ్డు కోతి సమాధి వద్ద రెండు లైట్లు దర్శనమిస్తున్నాయి. ఎవరైనా మా వీధిలో లైట్లు ఎలక లేదు అంటే మున్సిపాలిటీలో వీధి దీపాలు లేవని అధికారులు చెబుతున్నారు. కానీ ఒక స్తంభానికి రెండు లైట్లు వేసేందుకైతే అధికారులు సిద్ధంగా ఉన్నారు. అది కూడా ఆఫ్ చేసేందుకు వీలు లేకుండా డైరెక్ట్ గా కనెక్షన్ ఇవ్వడంతో పగలు రాత్రి అని తేడా లేకుండా వీధిదీపాలు వెలుగు తూనే ఉన్నాయి. దీంతో దావన వెళ్లే పాదాచారులు పగలే వెన్నెలాయే అని అనుకుంటున్నారు. మున్సిపాలిటీ వాళ్లను వీధి దీపాలు మా వీధిలో కాలిపోయాయి బిగించండి అంటే వీధిదీపాలు కొరత ఉంది వస్తానే బిగిస్తాం అంటున్నారు. మరి ఒక్క స్తంభానికి రెండు వీధి దీపాలు ఎలా వేశారు అర్థం కాలేదని ప్రజలు అంటున్నారు. మున్సిపాలిటీలో విద్యుత్ బకాయిలు కోట్లల్లో ఉన్నప్పటికీ పగలు ఈ విధంగా లైట్ వెలిగితే ఎంత బిల్లు వస్తుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఒక్క పోలుకు ఒక లైటు వేస్తే బాగుంటుందని, అది కూడా స్పీచ్ కంట్రోల్ తో ఆఫ్ చేసే విధంగా పెడితే ఇంకా బాగుంటుందని కరెంట్ బిల్లు తగ్గే అవకాశం కూడా ఉందని వారు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెండు లైట్లు ఉన్నచోట ఒకటి తీసివేసి లేని చోట బిగించాలని ప్రజలు కోరుతున్నారు.